RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్గిరి | సంపుటి : 2 సంచిక : 120 | మంగళవారం, జూన్ 11, 2024 | పేజీలు : 4

## గ్రూప్-4 మెరిట్ జాబితా విడుదల

హైదరాబాద్: రాష్ట్రంలో గ్రూప్ 4 ఉద్యోగాలకు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు ఎంపికైన అభ్యర్థుల జాబితాను టిజిపిఎస్సి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. ధృవపత్రాల పరిశీలనకు ఎంపికైన అభ్యర్థులు అవసరమైన సర్టిఫికెట్లు సిద్ధంగా ఉంచుకోవాలని కమిషన్ తెలిపింది. టిజిపిఎస్సి కార్యాలయం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించనున్నట్లు పేర్కొంది. అభ్యర్థులు ఈ నెల 13 నుంచి వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలని తెలిపింది. త్వరలోనే రోజువారీ సర్టిఫికెట్ వెరిఫికేషన్ షెడ్యూల్‌ను ప్రకటిస్తామని పేర్కొంది. రాష్ట్రంలో 8,180 గ్రూప్- 4 ఉద్యోగాల భర్తీకి గతేడాది జులై ఒకటో తేదీన రాతపరీక్ష నిర్వహించి, ఈ ఏడాది ఫిబ్రవరి 9న మెరిట్ జాబితాను టిజిపిఎస్సి ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో త్వరలోనే గ్రూప్-4 ఉద్యోగాల భర్తీకి సంబంధించి ధృవపత్రాల పరిశీలన నిర్వహించనున్నట్లు టిఎస్‌పిఎస్సి వెల్లడించింది.

## ప్రధాని మోదీ ఏపీ పర్యటన ఖరారు



న్యూఢిల్లీ: విజయవాడ కేసరపల్లి ఐటీ పార్కులో ఈ నెల 12న జరిగే చంద్రబాబు ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొననున్నారు. ఇందుకోసం ఢిల్లీ నుంచి ఉదయం 8.20 గంటలకు బయలుదేరి 10.40 గంటలకు గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి ప్రమాణ స్వీకార ప్రాంగణానికి చేరుకుని ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 12.45 గంటలకు విమానంలో భువనేశ్వర్‌కు బయలుదేరుతారు.

## సోనియాతో బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా భేటీ



బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనాతో కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ, కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ, పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా సమావేశమయ్యారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరైన హసీనా సోమవారం స్వదేశానికి తిరిగి వెల్తుండగా.. హస్తినలో సోనియా కుటుంబ సభ్యులతో భేటీ కావడం ప్రాధాన్యత తరించుకుంది. హసీనా, సోనియా భేటీలో ఇరు కుటుంబాల మధ్య ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. శనివారం ఢిల్లీకి చేరుకున్న షేక్ హసీనా ఆదివారం జరిగిన ప్రధాని మోదీ, ఆయన మంత్రివర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్నారు. అయితే హసీనా, గాంధీ కుటుంబానికి మధ్య ఏళ్లుగా అనుబంధం ఉంది.

### రేవంత్ చేతుల మీదుగా...

## టెన్త్ విద్యార్థులకు సత్కారం

హైదరాబాద్ : గవర్నమెంట్ స్కూల్ పదో తరగతిలో టాపర్ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు రవీంద్ర భారతిలో ఇవాళ సన్మాన కార్యక్రమం నిర్వహించారు.. వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్ పదో తరగతిలో ఉత్తమ ఫలితాలను అందించిన విద్యార్థులను సత్కరించారు.. వారికి జ్ఞాపికలతో పాటు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఇలాంటి కార్యక్రమాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తే బాగుండేదన్నారు. వందేమాతరం ఫౌండేషన్ ఇలాంటి మంచి కార్యక్రమం ద్వారా మా బాధ్యతను గుర్తు చేసిందని, ప్రయివేట్ పాఠశాలలతో పోటీపడి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు రాణించడం ప్రభుత్వానికి గర్వకారణమన్నారు. కార్పొరేట్ పాఠశాలలతో తమ విద్యార్థులు పోటీపడటం తమ గౌరవాన్ని మరింత పెంచిందని, విద్యార్థిని విద్యార్థులకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు రేవంత్ రెడ్డి. అంతేకాకుండా.. '90శాతం ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ప్రభుత్వ పాఠాశాలల్లో చదివినవారే. నాతో సహా ప్రముఖ రాజకీయ నాయకులంతా ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లో చదివినవారే.. విద్యార్థులు రావడం లేదని సింగిల్ టీచర్ పాఠశాలలను మూసివేసే పరిస్థితి గత ప్రభుత్వంలో ఉండేది.. మౌలిక వసతులపై దృష్టి కేంద్రీకరించకపోవడం వల్లే ఈ పరిస్థితి. కానీ సింగిల్ టీచర్ పాఠశాలలను మూసేయొద్దని మా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రతీ గ్రామం, ప్రతీ తండాకు విద్యను అందించేలా ప్రభుత్వం ముందుకెళుతుంది. శిథిలావస్థకు చేరిన అన్ని ప్రభుత్వ పాఠశాలల భవనాలను పునర్నిర్మించేందుకు రూ. 2వేల కోట్లతో పనులు ప్రారంభించాం. విద్యార్థులను బడిలో చేర్పించేందుకు ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోంది.




## మళ్లీ అమిత్ షాకే హోం...

### రక్షణకు రాజ్‌నాథ్..

### అవే శాఖల్లో నిర్మల.. జై శంకర్..!






న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్రమోదీ మంత్రి వర్గంలోని నలుగురు ప్రధాన నేతలు అమిత్ షా, రాజ్ నాథ్ సింగ్, నిర్మలా సీతారామన్, ఎస్ జై శంకర్ తమ పాత మంత్రిత్వశాఖలనే పొందారు. అమిత్ షాకు కేంద్ర హోంశాఖ, రాజ్ నాథ్ సింగ్ కు రక్షణ శాఖ, నిర్మలా సీతారామన్ కు ఆర్థికం, ఎస్ జై శంకర్ కు విదేశాంగ శాఖ కేటాయించారు. మోదీ 2.0 మంత్రి వర్గంలోనూ వీరు ఇదే శాఖలు నిర్వహించారు. కొత్తగా మంత్రివర్గంలోకి వచ్చిన మధ్యప్రదేశ్ మాజీ సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్‌కు వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి శాఖ కేటాయించగా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జగత్ ప్రకాశ్ నడ్డాకు ఆరోగ్యశాఖ అప్పగించారు. మోదీ తొలి విడుత మంత్రివర్గంలోనూ నడ్డా కొంత కాలం ఆరోగ్యశాఖ మంత్రిగా పని చేసిన సంగతి తెలిసిందే. హర్యానా మాజీ సీఎం మనోహర్ లాల్ ఖట్టర్‌కు విద్యుత్ శాఖ అప్పగించారు. రోడ్లు, రవాణా శాఖను తిరిగి నితిన్ గడ్కరీకే ప్రధాని మోదీ అప్పగించారు. ధర్మేంద్ర ప్రధాన్ యధావిధిగా విద్యాశాఖలోనే కొనసాగుతారు. గత ప్రభుత్వంలో భూశాస్త్ర వ్యవహారాల మంత్రిగా ఉన్న కిరెణ్ రిజిజును పార్లమెంటరీ వ్యవహారాల శాఖకు మార్చారు. అర్జున్ రామ్ మేఘ్వాల్ కు కొత్తగా న్యాయశాఖ అప్పగించారు. అసోం మాజీ సీం సర్బానంద సోనోవాల్ కు నౌకాయన శాఖ దక్కింది. ఆదివారం ప్రధాని మోదీతోపాటు 71 మంది కేంద్ర మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన సంగతి తెలిసిందే.

### ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన మోదీ...

### కిసాన్ నిధి విడుదల చేస్తూ ఫైల్‌పై

## తొలి సంతకం

న్యూఢిల్లీ: ప్రధాన మంత్రిగా నరేంద్ర మోదీ మూడోసారి బాధ్యతలు స్వీకరించారు. ఢిల్లీలోని సెంట్రల్ సెక్రటేరియట్ సౌత్ బ్లాక్‌లోని పీఎంవోలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పీఎం కిసాన్ నిధి 17వ విడత నిధులు విడుదల చేస్తూ ఫైల్‌పై తొలి సంతకం చేశారు. దీనివల్ల 9.3 కోట్ల మంది రైతులకు ప్రయోజనం చేకూరనుంది. దాదాపు రూ. 20 వేల కోట్ల ఆర్థిక సాయం అందనుంది. బాధ్యతలు స్వీకరించిన అనంతరం మోదీ మాట్లాడుతూ.. రైతు సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అందుకే రైతు సంక్షేమానికి సంబంధించిన ఫైల్‌పైనే తొలి సంతకం చేసినట్లు తెలిపారు. రైతుల కోసం, వ్యవసాయ రంగం అభివృద్ధి కోసం మున్ముందు మరిన్ని చర్యలు తీసుకోనున్నట్లు ప్రధాని వెల్లడించారు. కాగా, ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ వరుసగా మూడోసారి ఎన్నికైన విషయం తెలిసిందే. ఆదివారం రాత్రి న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో అట్టహాసంగా జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రమాణస్వీకారం చేశారు. మోదీ సహా 72 మందితో కేంద్ర క్యాబినెట్ కూడా ఏర్పాటైంది. ప్రధాని, మంత్రులతో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రమాణస్వీకారం చేయించారు. 30 మందికి క్యాబినెట్ మంత్రులుగా అవకాశం లభించింది. మరో ఐదుగురిని స్వతంత్ర హోదాతో సహాయ మంత్రులుగా, 36 మందిని సహాయ మంత్రులుగా మంత్రివర్గంలోకి తీసుకున్నారు.



### మోదీ 3.0 కేబినెట్ తొలి సమావేశం..

మోదీ 3.0 కేబినెట్ ఇవాళ తొలిసారి సమావేశం కానుంది. సాయంత్రం 5 గంటలకు ఢిల్లీలోని లోక్‌కల్యాణ్ మార్గ్‌లోని ప్రధాని నివాసంలో కేబినెట్ మంత్రులు సమావేశం కాబోతున్నారు. ఈ సమావేశంలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్ కింద 2 కోట్ల అదనపు గృహాలను ఆమోదించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. అంతేకాకుండా ఈ పథకం కింద లబ్ధిదారులకు అందించే సాయాన్ని దాదాపు 50 శాతం పెంచే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు సోమవారం వెల్లడించాయి.

### కొత్త కేంద్రమంత్రులకు...

## రేవంత్ సూచన



**హైదరాబాద్:** కేంద్రంలో ప్రధాని మోదీ నాయకత్వంలో మంత్రివర్గం కొలువుదీరింది. ఆదివారం సాయంత్రం రాష్ట్రపతి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రధాని సహా 72 మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. వారిలో రాష్ట్రానికి చెందిన ఇద్దరు, ఏపీ నుంచి ముగ్గురు ఉన్నారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన ఐదుగురు మంత్రులకు సీఎం రేవంత్ రెడ్డి సోషల్ మీడియాలో శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు రాష్ట్రాలకు రావాల్సిన ప్రాజెక్టుల సాధనకు కృషి చేయాలని కోరారు. తెలుగురాష్ట్రాల నుండి కేంద్ర మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన జి. కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్, కె.రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, భూపతిరాజు శ్రీనివాస వర్మ కు శుభాకాంక్షలు చెప్పారు. విభజన చట్టంలోని అంశాల అమలు, కేంద్రం నుండి తెలుగు రాష్ట్రాలకు రావాల్సిన నిధులు, పథకాలు, ప్రాజెక్టుల సాధనకు కృషి చేయాల్సిందిగా కోరుతున్నానన్నారు. విభజన చట్టంలో అనేక అంశాలకు జూన్ రెండో తేదీన ముగింపు లభించింది. ఉమ్మడి రాజదాని ప్రస్తావనకు కూడా కాలం తీరింది. అయితే పదేళ్లలోపు రెండు రాష్ట్రాల మధ్య విభజన సమస్యలన్నీ పరిష్కారం కావాలని లేకపోతే కేంద్రం పరిష్కారం చూపుతుందని చట్టంలో పేర్కొన్నారు. రెండు రాష్ట్రాలు అనేక సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోలేకపోయాయి.

### కశ్మీర్ లో బస్సుపై...

## ఉగ్రవాదుల దాడి

జమ్ము: కశ్మీర్ లో ప్రధాని మోడీ ప్రమాణస్వీకారం రోజునే పాకిస్థాన్ లష్కరే తొయిబాకు చెందిన 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్(టిఆర్ఎఫ్) పర్యాటక బస్సుపై దాడి చేసింది. ఇలాంటి మరిన్ని దాడులకు కూడా పాల్పడతామని హెచ్చరించింది. శివఖోరి ఆలయం నుంచి కట్రాలోని మాతా వైష్ణో దేవీ ఆలయానికి వెళుతున్న బస్సుపై ఉగ్రవాదులు మెరుపు దాడి చేశారు. డ్రైవర్కు బుల్లెట్ తాకడంతో వాహనం అదుపు తప్పి పక్కనే ఉన్న లోయలో పడిపోయింది. ఈ ఘలనలో తొమ్మిది మంది మరణించగా, 33 మందికి గాయాలయ్యాయి. డ్రైవర్ తో పాటు కండక్టర్ కూడా మరణించినట్లు అధికారులు తెలిపారు. ముఖాలు కప్పుకున్న ఆరేడుగురు ఉగ్రవాదులు బస్సుపై కాల్పులు జరిపారు. బస్సు లోయలో పడిపోగా మళ్లీ కాల్పులు జరిపారు. కానీ బతికి ఉన్నవారు కూడా చనిపోయినట్లు మౌనంగా ఉండిపోవడంతో వారు వెళ్లిపోయారు.



## సంపాదకీయం

# ఓటమి ఎరుగని నాయకురాలు

ఆమె ఒక రాష్ట్రపు తొలి మహిళా ముఖ్యమంత్రి. దేశంలో ముఖ్య మంత్రి పదవిని చేపట్టిన ద్వితీయ మహిళ. ఐదున్నర దశాబ్దాల రాజకీయ జీవితంలో ఓటమి ఎరుగని ప్రజా విశ్వాసాన్ని చూరగొన్న నాయకురాలు. భారత దేశాన్ని అప్రతి హతంగా కొంతకాలం ఏలిన దేశ తొలి తొలి మహిళా ప్రధాని ఇందిరా గాంధీ కి అత్యంత సన్నిహితురాలు, విశ్వస నీయురాలు. ఆమెనే ఐరన్ లేడీ ఆఫ్ ఒడిశాగా పేరెన్నిక గన్న నందిని సత్పతి. నందిని సత్పతీ (1931 జూన్ 9 – 2006 ఆగస్టు 4), జూన్ 1972 నుంచి డిసెంబరు 1976 వరకు ఒడిశా రాష్ట్ర ముఖ్యమంత్రిగా చేశారు. 1931 జూన్ 9న ఆమె జన్మించారు. ఆమె తండ్రి పద్మభూషణ్ కలాండి చరణ్ పాణిగ్రాహి ఒడిశాకు చెందిన సుప్రసిద్ధ వ్యక్తి. ఆమె తాత స్వనేశ్వర్ పాణిగ్రాహి గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడు. ఆమె మామ భగవతి చరణ్ పాణిగ్రాహి ఒడిశాలో కమ్యూనిస్ట్ పార్టీ స్థాపకులు. ఆమె రెండుసార్లు ధెంకనల్ నుండి ఎంపీగా ఎన్నికయ్యారు. 1972 లో, సార్వత్రిక ఎన్నికల్లో ఒడిశాలోని నలుగురు మాజీ ముఖ్య మంత్రులతో ఆమె ఒంటరి పోరాటం చేసి విజయం సాధించారు. రావెన్షా కళాశాలలో ఒడియాలో ఆర్ట్స్ లో మాస్టర్స్ డిగ్రీ చదివేటప్పుడు, ఆమె కమ్యూనిస్ట్ పార్టీ విద్యార్థి శాఖ అయిన స్టూడెంట్ ఫెడరేషన్ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొనేవారు. 1951లో కళాశాల విద్యకు రుసుములు పెరిగిన నేపథ్యంలో ఒడిశాలో విద్యార్థులు నిరసన ఉద్యమం ప్రారంభించారు. ఆ తరువాత అది దేశవ్యాప్త ఉద్యమంగా రూపుదాల్చింది. ఆ ఉద్యమానికి నందిని నాయకత్వం వహించారు. ఆ సమయంలో ఆమెపై లాఠీ చార్జి కూడా జరిగింది. మిగిలిన ఆందోళన కారులతో పాటు నందినిని కూడా జైలులో పెట్టారు. అక్కడే మరో విద్యార్థి నాయకుడు దేవేంద్ర సత్పతీని కలిశారు ఆమె. తరువాత వారిద్దరూ వివాహం చేసుకున్నారు. దేవేంద్ర ధేన్కనల్ నియోజకవర్గం నుంచి లోక్ సభకు ఎంపిగా రెండు సార్లు ఎన్నికయ్యారు. నందిని సత్పతి 1962 లో రాజ్యసభలో ప్రవేశించారు. 1966 లో ఇందిరా గాంధీ ప్రధాని అయిన తరువాత, నందిని సత్పతిని తన మంత్రివర్గంలో సమాచార, ప్రసార ఉప మంత్రిగా, తదుపరి మంత్రిగా నియమించు కున్నారు. నందిని సత్పతిని ప్రధానమంత్రి ఇందిరా గాంధీ రాజకీయములో కుడి భుజంగా భావించే వారు. బిజు పట్నాయక్ మరికొంత మంది కాంగ్రెస్ పార్టీ నుండి నిష్క్రమించిన కారణంగా 1972 లో నందిని సత్పతి ఒడిశాకు తిరిగి వచ్చి, ముఖ్యమంత్రి (జూన్ 1972 నుండి 1976 డిసెంబర్వ) అయ్యారు. అలా ఒడిశా మొదటి మహిళా ముఖ్యమంత్రిగా ఉన్నారు. భారత దేశంలో ముఖ్యమంత్రి అయిన రెండవ మహిళగా చరిత్రలో నిలిచారు. ఆమె వ్యక్తిత్వంలో ఫైర్ బ్రాండ్ నాయకత్వాన్ని గుర్తించిన ఇందిరా గాంధీ ఆశీస్సులతో నందిని ముఖ్యమంత్రిగా తొలి సారిగా జూన్ 14, 1972 లో బాధ్యతలు స్వీకరించారు. భారత దేశంలో ఎమర్జెన్సీ విధించినప్పుడు ఆమె పదవీకాలం ఒక సంవత్సరంలో ముగిసింది. మార్చి 6, 1973 నుండి డిసెంబర్ 16, 1976 వరకు ఆమె రెండవసారి తిరిగి ఎన్నికయ్యారు. నందిని సత్పతిని 'ఐరన్ లేడీ ఆఫ్ ఒడిశా' అని పిలిచేవారు. నందిని సత్పతి రాజకీయాలలోనే గాక ఒక రచయితగా గుర్తింపు పొందారు. ఆమె తస్లిమా నస్రీన్ నవల లజ్జాను ఒడియాలోకి అనువదించారు. అది ఆమె చేసిన ప్రధాన సాహిత్య రచన. నందిని సత్పతి సాహిత్య రచనలు ఇతర భాషల లోకి అనువదించబడి ప్రచురించ బడ్డాయి. ఒడియా సాహిత్యానికి ఆమె చేసిన కృషికి, ఆమె 1998 లో సాహిత్య భారతి సమ్మన్ అవార్డును అందుకుంది. నందిని సత్పతి ముఖ్యమంత్రిగా ఒడిశా రాష్ట్ర అభివృద్ధికి ఎనలేని కృషి చేశారు. ఆమె ముఖ్య మంత్రిగా పనిచేసినప్పుడు, ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ ప్రకటించిన జాతీయ అత్యవసర పరిస్థితి ఆమె రాజకీయ జీవితంలో కష్టతరమైన సవాలు. కొందరు రాజకీయ నాయకులను అరెస్టు చేయడంతో ఆమె విమర్శలు ఎదుర్కొన్నారు. అల్లకల్లోల సమయంలో ఆమె చేసిన మితిమీరిన చర్యలకు ఆమె ఎప్పుడూ మద్దతు ఇవ్వలేదు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఆమె చేసిన పనితీరు దాదాపు ప్రతి రంగంలోనూ వృద్ధిని సాధించింది. ముఖ్యంగా, మహిళల సాధికారత, గ్రామీణ వృద్ధి, కళ ,సంస్కృతి , విద్య వంటి రంగాలలో, ఆమె విశేషమైన చర్యలు తీసుకున్నారు. ఆ కార్యక్రమాలు నేటి వరకు ప్రజల జ్ఞాపకాలలో మరవలేనిది రాజకీయ పరిశీకులు పేర్కొంటారు. రైతులు లేదా వ్యవసాయ దారులు కాని భూములను తమ ఆధీనంలో ఉంచిన కొద్దిమంది వ్యక్తుల చేతుల నుండి భూములను విడిపించే ప్రత్యేకమైన భూ సంస్కరణల చట్టాన్ని తీసుకురావడం ఒక చరిత్రగా ఒడిశా రాష్ట్ర ప్రజలలో మిగిలి పోతుంది. తన యాభై-ఐదు సంవత్సరాల రాజకీయ జీవితంలో, ఆమె ఎన్నికలలో ఒక్క ఓటమిని కూడా ఎదుర్కోలేదు. ఎన్నికలలో ఆమె నలుగురు మాజీ ముఖ్యమంత్రులతో పోరాడి వారందరినీ ఓడించిన రికార్డును సొంతం చేసుకున్నారు. నందిని సత్పతి 2006 ఆగస్టు 4 న భువనేశ్వర్‌లోని తన నివాసంలో అనారోగ్యంతో మరణించారు.

### నిన్న ప్రమాణ స్వీకారం..

# నేడు రాజీనామా..

## కేంద్ర మంత్రి పదవిపై సురేశ్ గోపి అసంతృప్తి



న్యూఢిల్లీ: కేరళలోని త్రిసూరు నుంచి గెలిచిన బీజేపీ అభ్యర్థి సురేశ్ గోపి.. ఆదివారం కేంద్ర సహాయ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన విషయం తెలిసిందే. ప్రమాణ స్వీకారం చేసి ఒక్క రోజు కూడా గడవలేదు.. అప్పుడే ఆయన తన మంత్రి పదవి నుంచి తప్పుకోవాలని భావిస్తున్నట్లు తెలిసింది. పెండింగ్‌లో ఉన్న సినిమా షూటింగ్‌లను పూర్తి చేసేందుకు.. మంత్రి పదవి నుంచి వైదొలగాలని సురేశ్ గోపి భావిస్తున్నట్లు ఓ మలయాళీ మీడియా కథనాన్ని రాసింది. కేరళలో చరిత్రాత్మక విజయం సాధించిన సురేశ్ గోపి.. తనకు సహాయ మంత్రి పదవి ఇవ్వడాన్ని జీర్ణించుకోలేకపోతున్నట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. కేంద్ర మంత్రి పదవి నుంచి నన్ను రిలీవ్ చేస్తారని భావిస్తున్నానని, సినిమాలను పూర్తి చేయాల్సి ఉందని, ఈ అంశంపై కేంద్ర నాయకత్వమే నిర్ణయం తీసుకుంటుందని, ఒక ఎంపీగా తాను త్రిసూరులో మెరుగైన సేవలు అందిస్తానని, తనకు క్యాబినెట్ పొజిషన్ అవసరం లేదని సురేశ్ గోపి ఆ మీడియాకు తెలిపారు. మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసేందుకు ఢిల్లీకి రావాలని పిలిచినప్పుడు.. బీజేపీ కేంద్ర నాయకులతో తన సినిమా కమిట్‌మెంట్ల గురించి సురేశ్ గోపి చెప్పినట్లు కూడా తెలుస్తోంది. సురేశ్ గోపి ప్రస్తుతం నాలుగు చిత్రాల్లో నటించేందుకు సిద్ధంగా ఉన్నారు. పద్మనాభస్వామి ఆలయంపై తీస్తున్న చారిత్రక నేపథ్య చిత్రంలోనూ ఆయన నటిస్తున్నారు.

# మణిపూర్ సిఎం కాన్వాయ్‌పై కాల్పులు



జాతుల మధ్య వైరంతో అల్లకల్లోలంగా మారిన మణిపూర్‌లో ఏకంగా ముఖ్యమంత్రి బీరేన్‌సింగ్ పై సోమవారం ఉదయం దాడికి ప్రయత్నాలు జరిగాయి. సాయుధులైన తీవ్రవాదులు కాల్పులకు తెగబడ్డారని సీఎం కార్యాలయానికి చెందిన వర్గాలు వెల్లడించాయి. కాంగ్‌పోక్పి జిల్లాలో ఈ సంఘటన చోటు చేసుకుంది. ఇటీవల జిరిబామ్ జిల్లాలో ఓ వ్యక్తిని గుర్తు తెలియని దుండగులు దారుణంగా హత్య చేసిన తరువాత రాష్ట్రంలో ఉద్రిక్తతలు తీవ్రంగా మారాయి. 70 కి పైగా ఇళ్లు తగుల బెట్టారు. మరికొందరు పౌరులు వేరే చోటుకు పారిపోయారు. ఎన్నికల సమయంలో తమ వద్ద నుంచి లైసెన్స్ తుపాకులను జప్తు చేయడంతో వాటిని తిరిగి ఇచ్చేయాలంటూ స్థానికులు జిల్లా పోలీస్ స్టేషన్ ఎదుట నిరసనకు దిగారు. ఈ విధంగా అలజడులతో ఉన్న ఈ ప్రాంతాన్ని సందర్శించాలని ముఖ్యమంత్రి బీరేన్‌సింగ్ ఇంఫాల్ నుంచి జిరిబామ్‌కు బయలుదేరగా, ఆయన కాన్వాయ్‌పై తీవ్రవాదులు కాల్పులు జరిపారు. ఈ సంఘటనలో బీరేన్‌సింగ్ పరిస్థితిపై సమాచారం తెలియాల్సి ఉంది. అయితే సిబ్బందిలో ఒకరు తీవ్రంగా గాయపడినట్టు సమాచారం. రాష్ట్రంలో కొనసాగుతున్న ఘర్షణల కారణంగా ఇప్పటివరకు 200 మందికి పైగా మృతి చెందగా, వేలాది మంది నిరాశ్రయులయ్యారు.

## కేంద్ర మంత్రులుగా కిషన్‌రెడ్డి, బండి సంజయ్.. తెలుగు రాష్ట్రాల నుంచి ఐదుగురు



హైదరాబాద్ః కేంద్రంలో నరేంద్రమోడీ సారథ్యంలో ఏర్పడిన కొత్త మంత్రి వర్గంలో తెలంగాణ, ఆంధ్రపదేశ్ రాష్ట్రాల నుంచి ఐదుగురు ఎంపిలు కేంద్ర మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్రపతి భవన్‌లో ఆదివారం అట్టహాసంగా జరిగిన ప్రమాణస్వీకారోత్సవంతో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వీరితో మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేయించారు. తెలంగాణ రాష్ట్రంలో సికింద్రాబాద్ పార్లమెంటు స్థానం నుంచి విజయం సాధించిన జి.కిషన్ రెడ్డి, కరీంనగర్ నుంచి గెలుపొందిన బండి సంజయ్ కేంద్ర మంత్రులుగా హిందీలో ప్రమాణ స్వీకారం చేశారు. ఆంధ్రప్రదేశ్ నుంచి ఎన్డీయేలో భాగస్వామిగా ఉన్న తెలుగుదేశం పార్టీ నుంచి శ్రీకాకుళం ఎంపిగా గెలిచిన కింజరపు రామ్మోహన్ నాయుడు ఇంగ్లీషులో ప్రమాణ స్వీకారం చేశారు. గుంటూరు పార్లమెంటు నియోజకవర్గంలో విజేతగా నిలిచిన పెమ్మసాని చంద్రశేఖర్ సహాయ మంత్రిగా, బిజెపి నుంచి నరసాపురం పార్లమెంటు సభ్యుడిగా గెలిచిన భూపతిరాజు శ్రీనివాస్ వర్మ కేంద్రమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు.

# అల్లుపై ఆర్పీ కొనసాగుతున్న దాడి

**హైదరాబాద్:** జబర్దస్త్ నటుడు కిర్రాక్ ఆర్పీ, హీరో అల్లు అర్జున్ మధ్య జరుగుతున్న వివాదానికి ఇప్పుడప్పుడే ఫుల్ స్టాప్ పడేలా కనిపించడం లేదు. జనసేన గెలిచాక.. కిర్రాక్ ఆర్పీ వరుస ఇంటర్వ్యూలు ఇస్తూ అల్లు అర్జున్ పై మండిపడుతున్నాడు. ఎన్నికల ప్రచారంలో బన్నీ.. వైసీపీ నేత శిల్పారామాచంద్రరెడ్డి కి మద్దతు ప్రకటించిన విషయం తెల్సిందే. అంతేకాకుండా వారి ఇంటికి వెళ్లి ఎన్నికల్లో గెలవాలని ఆకాంక్షించి వచ్చాడు. అతను మంచి వాడు, మంచి స్నేహితుడు కాబట్టే తాను వెళ్లినట్లు బన్నీ చెప్పుకొచ్చాడు. ఈ మాటలపై ఆర్పీ ఫైర్ అయ్యాడు. అంటే కుటుంబంలో ఉన్న మనిషి.. చిన్నతనం నుంచి నువ్వు చూసిన మనిషి పవన్ మంచివాడు కాదా.. ? ఆయన ను నువ్వు చిన్నతనం నుంచి చూస్తున్నావ్.. అలాంటింది ఆయనకు మద్దతుగా కాకుండా వ్యతిరేకంగా ఉన్న పార్టీ నేతను గెలిపించమని అడగడం తనకు నచ్చలేదని చెప్పుకొచ్చాడు. అంతేకాకుండా మెగా అభిమానుల వలనే అల్లు అర్జున్ ఉన్నాడని అన్నాడు. ఇక దీంతో అల్లు ఫ్యాన్స్.. ఆర్పీపై రెచ్చిపోయారు. ఆర్పీ కుటుంబాన్ని తిట్టిపోస్తూ.. హోటల్స్ పై దాడి చేసారు. తాజాగా ఈ దాడిపై కూడా ఆర్పీ మాట్లాడాడు. తాను ఎవ్వరికీ భయపడేది లేదని స్పష్టం చేశాడు. కుటుంబం జోలికి వస్తే తాను అస్సలు ఊరుకొనేది లేదని తెలిపాడు. "నేను మిమ్మల్ని విమర్శిస్తే..నన్ను ఏమైన చేసుకోండి.. ఇంట్లో ఆడవాళ్ల మీద పడొద్దు అని నేను అప్పట్లో వైసీపీ ప్రభుత్వానికి చెప్పాను.. ఇప్పుడు అల్లు అర్జున్ ఆర్మీకి చెప్తున్నా. అదే ప్రభుత్వంలా మీ ఆర్మీ ప్రవర్తిస్తుంది అల్లు అర్జున్ గారు.. అసలు మీకు ఆర్మీ ఉందా.. ? లేదా అన్న విషయం కూడా నాకు తెలియదు. అలానే ఆడోళ్ళ మీద పడిన ప్రభుత్వం పతనమైంది. గుర్తుపెట్టుకోండి అల్లు అర్జున్ గారు.. ఇలాంటిది మీరు ప్రోత్సహిస్తున్నారు. మీరు చేస్తున్నారు కాబట్టే మీకు పతనం మొదలు కాబోతుంది. నేను ఎవరికి భయపడను, మీ పేరు అల్లు అర్జున్ అయితే నా పేరు కిరాక్ ఆర్పీ. ఎవడి గుండె వాడికి ఉంటుంది.. ఎవడి ఫ్యామిలీ వాడికి ఉంటుంది. నేను ఇప్పటికీ చెప్తున్నా.. ఆరోజు మీరు చేసింది తప్పు. అది నిజమనుకుంటే నమ్మండి.. లేకపోతే ఒక గాడిద మాట్లాడిందని వదిలేయండి. అంతేగాని ఇంట్లో వాళ్ళను టార్గెట్ చేయాల్సిన అవసరం ఏముంది. మీ ఇళ్లలో ఆడవారు లేరా.. ?నేను ఇప్పటికీ చెప్తున్నా ఆర్మీ అంటే జన సైనికులు.. ఆర్మీ అంటే టీడీపీ నేతలు. ఎలాంటి స్వార్థం లేకుండా నిలబడ్డారు. ఎన్ని గొడవలు.. ఎన్ని పోలీస్ కేసులు.. ఇవన్నీ భరించారు. మీరు సినిమాలు చేసుకోండి.. పాన్ ఇండియా స్టార్ అవ్వు.. దేశానికి పేరు తీసుకురా.. మేము కూడా చూస్తాం. ఒక గొప్ప హీరో మీరు. మరి మీకు ఆర్మీ ఎక్కడ నుంచి వచ్చింది" అని చెప్పుకొచ్చాడు. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు నెట్టింట వైరల్ గా మారాయి. మరి ఆర్పీ వ్యాఖ్యలుపై అల్లు అర్జున్ ఏమైనా స్పందిస్తాడేమో చూడాలి.

# చట్టానికి లోబడే చర్యలు...

విజయవాడ: వైఎస్సార్ సీపీ నేతలపై టీడీపీ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరావతిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వైఎస్సార్ సీపీ నేతలు చేస్తున్న ఆరోపణలపై మండిపడ్డారు. ప్రజాస్వామ్యాన్ని గౌరవించిన పార్టీ టీడీపీ అంటూ ఆయన కొనియాడారు. వైఎస్సార్ సీపీ పార్టీ అధికారంలో ఉండగా కూటమి పార్టీలంతా కలిసి ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమాన్ని చేపట్టాయంటూ పట్టాభి గుర్తుచేశారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని బతికించామన్నారు.'ఇక మీదట రాష్ట్రంలో ఎక్కడా కూడా భౌతిక దాడులు జరగవు. హింసను టీడీపీ అసలే ప్రేరేపించదు. నారా లోకేశ్ రెడ్ బుక్ రియాలిటీ. ఐపీసీ సెక్షన్ల పవరేంటో చూపిస్తాం. రెడ్ బుక్ లో పేర్లు నమోదైన పిల్ల సైకోలు, అవినీతిపరులైనటువంటి అధికారుల సంగతి ఖచ్చితంగా తేలుస్తాం. చట్టానికి లోబడే గట్టిగా బుద్ధి చెబుతాం. ఈ విషయంలో రాజీపడే ప్రసక్తే లేదు. పిల్ల సైకోలంతా ఈ విషయాన్ని గుర్తుపెట్టుకోవాలి. గత ఐదేళ్లలో వైఎస్సార్ సీపీ నేతలు ఎన్నో పాపాలు చేశారు. దేవాలయం లాంటి మా కార్యాలయంపై కూడా దాడి చేశారు. అప్పుడు మీకు ప్రజాస్వామ్యం గుర్తుకు రాలేదా..? మాచర్లలో బొండా ఉమా, బుద్ధ వెంకన్నపై దాడి చేసినప్పుడు, చంద్రబాబు అమరావతి పర్యటనలో ఆయనపై రాళ్లు, కర్రలు వేసి మాది భావ ప్రకటనా స్వేచ్ఛ అని చెప్పి కలరింగ్ ఇచ్చినప్పుడు మీకు ప్రజాస్వామ్యం గుర్తుకు రాలేదా..?బాధ్యత గల ముఖ్యమంత్రి పదవిలో ఉంటూ మావాళ్లకు బీపీలు రావా? అంటూ జగన్ రెచ్చగొట్టేలా మాట్లాడినప్పుడు మీకు ప్రజాస్వామ్యం గుర్తుకురాలేదా..? తోట చంద్రయ్య, కంచర్ల జల్లయ్య, కిరణ్, డాక్టర్ సుధాకర్, అబ్దుల్ సలాం, అమర్ నాథ్ వంటి వారి చావుకు కారకులైనప్పుడు.. టీడీపీ నేత చెన్నుపాటి గాంధీపై దాడి చేసి కంటిచూపు పోగొట్టినప్పుడు మీకు ప్రజాస్వామ్యం గుర్తుకురాలేదా..? యువగళం పాదయాత్రలో సుమారు 22 సార్లు రాళ్లదాడులు జరిగినప్పుడు ప్రజాస్వామ్యం గుర్తుకురాలేదా..? జగన్ పాదయాత్ర చేసినప్పుడు అలా జరిగిందా..? అమరావతి రైతులపైనా దాడి చేశారు. అప్పుడు మీకు ప్రజాస్వామ్యం ఏమైంది..? ఇప్పుడా మీరు మాకు నీతి కబుర్లు చెప్పేది..?' అంటూ వైఎస్సార్ సీపీ నేతలపై పట్టాభి ఆగ్రహం వ్యక్తం చేశారు.

# జగనన్నా... వలంటీర్లు కాదు... కేడర్ ముఖ్యం

## - శ్రీరెడ్డి శ్రీరంగ నీతులు

***హైదరాబాద్:*** *నటి శ్రీరెడ్డి రూటు మార్చిందా? మొన్నటి వరకు టీడీపీపై విరుచుకుపడే ఆమె, తన వాయిస్ మార్చుకున్న ట్లు కనిపిస్తోందా? ఈసారి ఎన్నికల్లో వైసీపీ ఫెయిల్ అయ్యిందా? ముమ్మాటికీ అవుననే అంటోంది శ్రీరెడ్డి. వైసీపీ చాలా విషయాల్లో వీక్‌గా ఉందని వివరించింది. ఈ విషయంలో చంద్రబాబు, ఆయన కార్యకర్తలను చూసి సిగ్గుకోవాలంది శ్రీరెడ్డి. ఇంతకీ ఆమెలో వచ్చిన ఈ మార్పుకు కారణమేంటని చర్చించుకోవడం వైసీపీ హార్డ్ కోర్ ఫ్యాన్స్ వంతైంది. కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్నారు జగన్. అదే ఊపుతో 2019 ఎన్నికల్లో ఎవరూ ఊహించని విధంగా రికార్డు స్థాయిలో 151 సీట్లను గెలుచుకుంది వైసీపీ. ఈసారి సంక్షేమ పథకాలతో తాము గట్టెక్కించవచ్చని భావించింది. వైసీపీని పదేళ్లపాటు మోసిన కార్యకర్తలను దూరం పెట్టేశారు. దాని ఫలితంగా ఈసారి ఎన్నికల్లో 11 సీట్లు ఇచ్చారు. ఇదంతా ప్రజలు రాసిన స్క్రిప్ట్. ఈసారి ఎన్నికల్లో కార్యకర్తలను దూరం పెట్టేశారు జగన్. ఈసారి ఎన్నికల్లో వాలంటీర్లు, ఐప్యాక్, దేవుడు, ఓటర్లను మాత్రమే నమ్ముకున్నారు జగన్. ఫలితం తారుమారైంది. దీనిపై నటి శ్రీరెడ్డి మనసులోని ఆవేదనను వ్యక్తంచేసింది. ఈ విషయంలో తాను చెప్పింది జగనన్నా కచ్చితంగా వినాలని రిక్వెస్ట్ చేసింది. టీడీపీ పవర్ గురించి వివరించిందామె. ముఖ్యనేతలు పార్టీని వదిలిపెట్టినా ఆ పార్టీ పట్టించుకోలేదని వెల్లడించింది. టీడీపీ కేవలం కార్యకర్తలను మాత్రమే నమ్ముకుందని తెలిపింది. మళ్లీ నిలబడదామని కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపిందని, ఐ టీడీపీ ఎంత స్ట్రాంగ్ మీకు తెలుసా అని ప్రశ్నలు రైజ్ చేశారామె. వాళ్ల దగ్గరున్న టెక్నాలజీ దేశంలోని ఎవరి దగ్గరా లేదని శ్రీరెడ్డి అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. ఇక వైసీపీ ఎన్ఆర్ఐ వింగ్ అమెరికా, ఆస్ట్రేలియా విభాగాల నేతలు ఇదే విషయాన్ని ప్రస్తావించారు. పదేళ్ల పాటు పార్టీని నిలబెట్టిన కార్యకర్తలను దూరం చేసుకోవడమే ఈ పరిస్థితికి కారణమన్నారు. కేవలం వాలంటీర్లను నమ్ముకుని కార్యకర్తలను దూరం చేశారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇది నాయకుడి లక్షణం కాదని, వైసీపీ నుంచి నేతలు సర్దుకోవడం మంచిదన్నారు. వైఎస్సార్ వారసుడు జగన్ కాదన్నారు. మొత్తానికి జగన్ వ్యవహారశైలిపై ఒకొక్కరు తమ తమ అసంతృప్తిని వ్యక్తం చేశారు.*

# లోక్‌సభ స్పీకర్‌గా పురంధీశ్వరి..?



హైదరాబాద్ః కేంద్రంలో కొత్త ఎన్‌డియే ప్రభుత్వం ఏర్పాటైన నేపథ్యంలో లోక్‌సభ స్పీకర్ ఎంపికపై బీజేపీ అధిష్టానం దృష్టి సారించింది. లోక్‌సభ స్పీకర్ పదవి ఎవరికి ఇవ్వాలనే అంశంపై బిజెపి అగ్రనాయకత్వం కసరత్తు చేస్తోంది. అయితే లోక్‌సభ స్పీకర్ పదవిని తెలుగుదేశం పార్టీకి ఇవ్వాలని ఆ పార్టీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు ప్రధాని మోడీపై ఒత్తిడి తెస్తున్నారు. కానీ అనేక సర్దుబాట్లు, సంప్రదింపుల తర్వాత బిజెపి ఎంపికే లోక్‌సభ స్పీకర్ పదవిని ఇచ్చేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. దీనిపై ఒకటి రెండు రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. బిజెపి తరఫున ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రి లోక్ సభ స్థానం నుంచి విజయం సాధించిన ఆ రాష్ట్ర బిజెపి అధ్యక్షురాలు పురంధీశ్వరికి లోక్‌సభ స్పీకర్ పదవి ఇచ్చేందుకు బిజెపి నాయకత్వం ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఏపీ, తెలంగాణలో బాగా పనిచేసినందున లోక్‌సభ స్పీకర్‌గా పురందేశ్వరి పేరును పరిశీలిస్తున్నట్లు సమాచారం. 2014 నుంచి 2019 మధ్య మోదీ తొలి టర్మ్‌లో సుమిత్రా మహాజన్ మహిళా స్పీకర్‌గా ఉన్నారు. ఇప్పుడు బీజేపీ నారీ శక్తికి పెద్దపీట వేస్తుండడంతో పురంధేశ్వరి పేరును పరిశీలిస్తున్నట్లు చెబుతున్నారు. పురంధేశ్వరి మాజీ మంత్రి, హిందీ, ఆంగ్లంలో కూడా మంచి ప్రావీణ్యం ఉన్నందున ఆమె పట్ల పార్టీ అధిష్టానంగా మొగ్గుచూపుతోంది. తాజాగా జరిగిన లోక్ సభ ఎన్నికల్లో ఏపీలో బీజేపీ, టీడీపీ, జనసేన కూటమిగా ఏర్పాటులో పురంధేశ్వరి కీలక పాత్ర వహించారు. ఈ ఎన్నికల్లో పురంధేశ్వరి రాజమండ్రి లోక్ సభ నుంచి వైసీపీ అభ్యర్థి గూడూరు శ్రీనివాస్ చేతిలో 2,39,139 ఓట్ల భారీ మెజారిటీతో గెలుపొందారు. పురంధేశ్వరి రాజకీయ ప్రస్థానం పరిశీలిస్తే 2004లో అనూహ్యంగా కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకొని బాపట్ల నుంచి 14వ లోక్ సభకు ఎన్నికయ్యారు. ఆ తర్వాత డీ లిమిటేషన్‌లో అది ఎస్సీ రిజర్వ్ స్థానం కావడంతో 2009లో విశాఖ పట్నం నుంచి ఎంపీగా పోటీ చేసి పార్లమెంట్‌లో అడుగుపెట్టారు. 2006లో మన్మోహన్ సింగ్ ప్రభుత్వంలో కేంద్ర మానవ వనరులు శాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు ఆమె బాధ్యతలు నిర్వహించారు. ఆ తర్వాత ఏపీ విభజన నేపథ్యంలో ఆమె భారతీయ జనతా పార్టీలో చేరారు. 2014 ఎన్నికల్లో రాజంపేట నుంచి బీజేపీ తరుపున ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. ఇక 2024లో రాజమండ్రి నుంచి పోటీ చేసి ఎంపీగా గెలిచారు. ఇంత రాజకీయ నేపథ్యం ఉన్న పురంధీశ్వరి తాజాగా లోక్ సభ స్పీకర్‌గా ఎన్నిక కావడం లాంఛనమే అంటున్నారు. ఒక వేళ లోక్‌సభ స్పీకర్‌గా నియమించబడితే అనంత శయనం అయ్యంగార్, నీలం సంజీవ్ రెడ్డి, జీఎంసీ బాలయోగి తర్వాత ఆ పదవి చేపట్టబోతున్న నాలుగో తెలుగు వ్యక్తిగా ఆమె రికార్డులకు ఎక్కుతారు. అంతేకాదు మీరా కుమార్, సుమిత్రా మహాజన్‌ల తర్వాత మూడో మహిళా స్పీకర్‌గా పురంధేశ్వరి నిలుస్తారని చర్చ జరుగుతోంది.

# స్వరూపానంద భయం ఎందుకో...

**విశాఖపట్టణం:** విశాఖ శ్రీశారదా పీఠాధిపతి స్వామి స్వరూపా నందేంద్ర సరస్వతి కీలక వ్యాఖ్యలు చేశారు. కాబోయే ముఖ్యమంత్రి చంద్రబాబును ఆయన పొగుడుతూ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం చర్చనీయాంశం అయ్యాయి. త్వరలో ప్రమాణ స్వీకారం చేయబోతున్న చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్‌లకు అమ్మవారి ఆశీర్వాదం ఎల్లప్పుడూ ఉంటుందని అన్నారు. చంద్రబాబు హయాంలో ఏపీ అభివృద్ధి చెందుతుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. ఇలా తాను చంద్రబాబును కొత్తగా పొగుడుతున్నానని ఎవరు అనుకోవద్దని అన్నారు. ఏపీ రాజధానిగా తీర్చిదిద్దే అమరావతిలో తమ విశాఖ శారదా పీఠానికి స్థలం ఉందని, అక్కడ పీఠాన్ని నిర్మించి అభివృద్ధి చేస్తామని స్వరూపానందేంద్ర అన్నారు."అమ్మవారి కృపతో మూడో సారి బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చింది. కేదారీ.. హరిద్వార్ తో సహా ఉత్తర భారతదేశం మొత్తం మోదీ అభివృద్ధి చేశారు. త్వరలో ప్రమాణ స్వీకారం చేయబోతున్న చంద్రబాబు, పవన్ కళ్యాణ్ లకు అమ్మవారి ఆశీర్వాదం ఉంటుంది. శ్రీకాకుళం జిల్లాకు చెందిన రామ్మోహన్ నాయుడుకు కేంద్ర మంత్రి పదవి లభించడం సంతోషకరం. శ్రీ మహా లగ్నంలో 11.25 గంటలకు సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయబోతున్నారు. ఇది శుభ లగ్నం. చంద్రబాబు హయాంలో ఏపీ అభివృద్ధి చెందుతుందని భావిస్తున్నా. క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న ఏపీని చంద్రబాబు ఆదుకుంటారని ఆశిస్తున్నాను. ఏపీ రాజధానిగా తీర్చిదిద్దే అమరావతిలో మా పీఠానికి స్థలం వుంది. అక్కడ పీఠాన్ని అభివృద్ధి చేస్తాం. ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా అమ్మవారి అశీస్సులు వుండాలని ఆశిస్తున్నా. చంద్రబాబు.. పవన్ కళ్యాణ్ హయాంలో దేవాదాయ శాఖ అభివృద్ధి చెందాలని కోరుతున్నా. శ్రీశైలంలో మాఘమాసంలో కూంభాభిషేకం వద్దని లేఖ రాశాను.. వినలేదు.. ఏం జరిగిందో చూశారు కదా. స్వరూపానందేంద్ర ప్రభుత్వాలపై బతికే పీఠం కాదు. ఎప్పుడూ ప్రజల పక్షాన శారదా పీఠం వుంటుంది. గతంలో చంద్రబాబు హయాంలో మురళీ మోహన్ గెలవాలని రాజమండ్రిలో భారీ ఆధ్యాత్మిక కార్యక్రమం పెట్టాను. రాజకీయాల్లో ఇప్పుడు పెద్ద దిక్కు చంద్రబాబు. బాబు హయాంలో టీటీడీ అభివృద్ధి జరుగుతుంది. ఎరుక కంటే మరుపు ఎక్కువ.. శారదా పీఠానికి ఎందరో మంత్రులు.. గవర్నర్ లు వచ్చారు.. వైఎస్సార్ సీపీ మంత్రులు మాత్రమే రాలేదు. ఇది ధర్మం కోసం పని చేస్తున్న పీఠం" అని స్వరూపానందేంద్ర సరస్వతి మాట్లాడారు.

**జగన్ హయాంలో భూముల కేటాయింపు**

గత ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి విశాఖ శారదా పీఠానికి అమరావతి ప్రాంతంలో భూముల కేటాయింపు చేశారు. ఇంకా భవన నిర్మాణ అనుమతులు కూడా ఇచ్చారు. ఆ వ్యవహారం అప్పట్లో బాగా వివాదాస్పదం అయింది. శారదాపీఠానికి జగన్ అత్యంత ప్రాధాన్యం ఇవ్వడంపై బాగా విమర్శలు వచ్చాయి. వైసీపీతో బాగా దగ్గరగా స్వరూపానందేంద్ర మెలిగారు. అలాంటి స్వరూపానందేంద్ర వైసీపీ ఓటమి పాలైన వెంటనే చంద్రబాబుపై పొగడ్తలు చేశారు.

మరోవైపు, చంద్రబాబు స్వరూపానందేంద్రను గతంలో ఓ సందర్భంలో దొంగ స్వామి అన్న సంగతి తెలిసిందే. చంద్రబాబు సహజంగానే స్వరూపానందేంద్రను వ్యతిరేకించేవారు. తాజాగా అమరావతి ప్రాంతంలో గత ప్రభుత్వం కేటాయించిన భూముల కేటాయింపును చంద్రబాబు ప్రభుత్వం రద్దు చేస్తుందనే భయంతోనే స్వరూపానందేంద్ర ఇలా పొగడ్తలు చేశారని అంటున్నారు.

## 10కి చేరిన జమ్మూ మృతులు

**శ్రీనగర్:** ఉగ్రవాదులు మరోసారి దారుణానికి పాల్పడ్డారు. జమ్మూ కాశ్మీర్‌లోని రియాసీ జిల్లాలో ఓ యాత్ర బస్సుపై విచక్షణారహితంగా దాడులు చేశారు. ఈ ఘటనలో 10 మంది యాత్రికులు ప్రాణాలు కోల్పోయారు. ఈ దాడిలో దాదాపు 30 మంది ప్రయాణికులు గాయలపాలయ్యారు. ఆదివారం సాయంత్రం 6.10 గంటలకు జమ్మూలోని రాయసీ జిల్లాలో ఉన్న శివఖోడి గుహను సందర్శించుకొని తిరిగి వస్తుండగా యాత్రికుల బస్సుపై ఉగ్రవాదులు ఒక్కసారిగా కాల్పులకు తెగపడ్డారు. ఉగ్రవాదాలు ఒక్కసారిగా కాల్పులు చేశారు. ఈ కారణంగా డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో బస్సు అదుపుతప్పి పక్కనే ఉన్న ఓ లోయలో పడిపోయింది. ఈ దాడిలో గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించారు. అయితే మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. పారామిలటరీ, సైన్యం సహాయ చర్యలలో పాల్గొన్నాయి. ఉగ్రదాడుల నేపథ్యంలో రియాసీ జిల్లాతోపాటు పరిసర ప్రాంతాల్లో భద్రతా దళాలు విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నాయి. యాత్రికులపై ఉగ్రవాదుల దాడి ఘటనపై ప్రధాని మోదీ స్పందించారు. అక్కడ పరిస్థితులను పర్యవేక్షించాలని, బాధితులు, వారి కుటుంబాలకు సాయం అందించాలని మోదీ అందించారు. కా?గా ప్రజలకు భద్రత కల్పించాలని కాంగ్రెస్ నేత మల్లిఖార్జున్ ఖర్గే ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే జమ్మూకాశ్మీర్ లెఫ్ట్ నెంట్ గవర్నర్ తీవ్రంగా ఖండించారు. ఈ ఘటన కలచివేసిందని రాష్ట్రపతి ద్రౌపది ముర్మ ఎక్స్ వేదికగా స్పందించారు.

## మెట్రో లో మళ్లీ మహిళల రచ్చ

న్యూఢిల్లీ: ఢిల్లీ మెట్రోలో తరచూ ఏదో ఒక వీడియో తెరపైకి వస్తూనే ఉంటుంది. మెట్రోలో అసభ్యంగా ప్రవర్తించడం, అసభ్యకరమైన దుస్తులు ధరించి మహిళలు ప్రయాణించడం, గొడవలు, కొట్లాటలు, దుర్భాషలాడడం, రీల్స్ చేయడం, ముద్దులు పెట్టుకోవడం వంటి ఎన్నో ఘటనలు జరిగిన విషయం తెలిసిందే. అయితే అధికారులు ఇలాంటి ఘటనలపై చర్యలు తీసుకుంటున్నా కూడా ప్రయాణికులు మాత్రం మారడం లేదు. తాజాగా మరోసారి ఢిల్లీ మెట్రో వార్తల్లో నిలిచింది. ఇద్దరు మహిళల మధ్య జరిగిన గొడవకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. వీడియోలో లేడీస్ కోచ్‌లో ఇద్దరు మహిళల మధ్య గొడవ జరుగుతున్నట్లు కనిపించింది. అక్కడ కూర్చున్న చాలా మంది ప్రయాణికులు ఈ సంఘటనను వీడియోలు తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. తొలుత కాస్త నెమ్మదిగానే మొదలైన గొడవ రానురాను పెరిగిపోయింది. ఒకరిపై ఒకరు గొంతు పెంచుకుని అరుచుకోవడం ప్రారంభించారు. దీంతో అక్కడ ఉన్న చాలా మంది యువతులు పక్కకు జరిగిపోయారు. ఈ తరుణంలో ఒక్కసారిగా ఒకరిపై ఒకరు దాడికి పాల్పడ్డారు. దీంతో మరోక మహిళ జోక్యం చేసుకుని ఇద్దరిని ఆఫేందుకు ప్రయత్నించినట్లు వీడియోలో కనిపిస్తుంది. మహిళ ఆపేందుకు ప్రయత్నించినా కూడా ఇద్దరు ఆగకుండా ఒకరిపై ఒరకు దాడి చేసుకున్నారు. ఒకరు జుట్టు పట్టుకుని మరొకరు గొంతు పట్టుకుని కొట్టుకున్నారు. దీంతో ఈ వీడియోను తోటి ప్రయాణికులు సోషల్ మీడియాలో షేర్ చేయడంతో వైరల్ అవుతోంది. వీడియో చూసిన కొంతమంది నెటిజన్లు 'ఢిల్లీ మెట్రోలో ఇవన్నీ కామన్' అంటూ కామెంట్స్ చేస్తున్నారు.

# రాజకీయ అనుభవశాలి

గోగినేని రంగనాయకులు... ఈ పేరు అంతగా ప్రాచుర్యం లేనిది. ఈ పేరు చెపితే దేశంలో గుర్తు పట్టే వారు దాదాపు ఉండక పోవచ్చు. ఆయన ఒక నిబద్ధత కలిగిన పాతతరం రాజకీయ నాయకులు. ఆయనను భారత రైతాంగ ఉద్యమపితగా భావిస్తారు. సుదీర్ఘ పార్లమెంటేరియన్‌గా గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లోకి ఎక్కిన ప్రజాప్రతినిధి. లోక్‌సభలోనూ, ఇటు రాజ్యసభలోనూ 60 ఏళ్ళు రైతుల పక్షాన పోరాడిన నాయకులు. రాజకీయ అవగాహన కలిగిన వారికి ఇప్పుడు ఆయనెవరో స్ఫురణకు వచ్చి ఉంటుంది. రైతాంగ విధానాలకు మద్దతు నిచ్చిన ఆయనే సుధీర్ఘ రాజకీయ నేపథ్యం ఉన్న ఆచార్య ఎన్.జి.రంగా. ఆచార్య రంగా (నవంబరు 7, 1900 – జూన్ 9, 1995) భారత స్వాతంత్ర్య సమర యోధులు, పార్లమెంటు సభ్యులు, రైతు నాయకుడు. 1935లో తొలిసారి కేంద్ర శాసనసభకు సభ్యులై అప్పటి నుంచి మరణించే వరకు నిరంతరం పార్లమెంటేరియన్ గానే కొనసాగారు. రంగా, 1900, నవంబరు 7 న గుంటూరు జిల్లా నిడుబ్రోలులో గోగినేని నాగయ్య, అచ్చమాంబ దంపతులకు జన్మించారు. నిడుబ్రోలులో ప్రాథమిక విద్యను ముగించుకొని, గుంటూరు ఆంధ్రా క్రిష్టియన్ కళాశాల నుండి పట్టభద్రు లైనారు. 1924లో భారతీ దేవితో రంగా వివాహం జరిగింది. 1926 లో ఆక్స్‌ఫర్డ్ విశ్వ విద్యాలయం నుండి అర్థ శాస్త్రములో బి.లిట్ పొంది భారత దేశానికి తిరిగి వచ్చిన తర్వాత మద్రాసు లోని పచ్చయప్ప కళాశాలలో ఆర్థిక శాస్త్ర ఆచార్యునిగా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు. ఆయన ప్రధానంగా హేతువాది. 1930లో మహాత్మా గాంధీ పిలుపుకు స్పందించి రంగా భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు. 1933లో రైతు కూలీ ఉద్యమానికి నేతృత్వం వహించారు. కిసాన్ కాంగ్రెస్ పార్టీని స్థాపించారు. రైతుకూలీల పరిస్థితిపై గాంధీతో చారిత్రాత్మక చర్చలు జరిపారు. ఈ చర్చలలోని ముఖ్యాంశాలపై "బాపు దీవెనలు" అన్న పేరుతో రంగా ఒక పుస్తకాన్ని వెలువరించారు. ఆంధ్రలో తొలిసారి రాజకీయ పాఠశాలలను ప్రారంభించిన ఖ్యాతి రంగాదే. నిడుబ్రోలులో రామనీడు పేరుతో రాజకీయ పాఠశాలను ఏర్పాటు చేసారు. 1933వ సం.లో రంగా స్థాపించిన రాజకీయ విద్యాలయాన్ని మహాత్మాగాంధీ ప్రారంభించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్య మంత్రులు నారా చంద్రబాబు నాయుడు , కొణిజేటి రోశయ్య కూడా రంగా శిష్యులే. ఆ పాఠశాల గత మధుర స్మృతులకు సజీవ సాక్ష్యంగా నేటికి నిడుబ్రోలులో కొనసాగుతుంది. తొలి రాజకీయ పాఠశాలలో పుచ్చలపల్లి సుందరయ్యతో సహా కొందరు కమ్యూనిసులూ పాల్గొన్నారు. రంగా ఆంగ్లంలోను, తెలుగులోను మంచి రచయిత. 'హరిజన నాయకుడు' అనే నవల కూడా రాశారు. ఆంధ్ర రాజకీయాలలో గాంధీ అనుచరుడిగా పట్టాభి సీతారామయ్య ఉండగా, రంగా గాంధీకి సన్నిహితుడు కాలేక పోయారు. అయినా పార్టీ సిద్ధాంత పరంగా గాంధేయుని గానే కొనసాగారు. సుభాస్ చంద్రబోస్ అంటే ఇష్టపడేవారు. 1937 నుంచి వాహిని అనే పత్రికను నడిపారు. 1938 నాటికే ఇందులాల్ యాగ్నిక్‌తో కలిసి కిసాన్ సభలు నిర్వహించారు. ప్రకాశం పంతులుతో కలిసి ఆంధ్ర రాజకీయాలలో కీలక పాత్ర వహించిన రంగాకు చాలా మంది శిష్యులు ఉండేవారు. గౌతు లచ్చన్న, పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి, కందుల ఓబుల రెడ్డి, చేగిరెడ్డి బాలిరెడ్డి, ఎన్.వి. నాయుడు, నీరుకొండ రామారావు, బీశెట్టి అప్పారావు, పి.రాజగోపాల నాయుడు ఇత్యాదులు ఎందరో రంగా పిలుపు నందుకొని రాజకీయాలలో ప్రవేశించారు. స్వాతంత్ర్య పోరాటంలో నిర్విరామంగా పాల్గొన్న రంగా అనేక పర్యాయాలు జైలు పాలయ్యారు. జైళ్ళలోకూడా రాజకీయ ఖైదీలకు పాఠశాలలు నిర్వహించారు. ఇంగ్లాండ్‌లోని ఆక్స్‌ఫర్డ్ విశ్వ విద్యాలయంలో ఉన్నత విద్యాభ్యాసం చేశారు. మద్రాసు లోని పచ్చయప్పాస్ కళాశాలలో ఆర్థిక శాస్త్రాచార్యుడిగా చేరి నాలుగేళ్ళ పాటు ఉన్నప్పుడు రంగాకు విద్యార్థిగా అన్నాదొరై తమిళనాడు ముఖ్యమంత్రి) ఉండేవారు. రంగా, అంతర్జాతీయ వ్యవసాయ ఉత్పత్తిదారుల సమాఖ్య వ్యవస్థాపకులలో ఒకరు. 1946లో కోపెన్ హేగెన్‌లో జరిగిన ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజెషన్ సదస్సులో, 1948లో శాన్ ఫ్రాన్సిస్కోలో జరిగిన అంతర్జాతీయ శ్రామిక సంస్థ సదస్సులోనూ, 1952లో ఒట్టావాలో జరిగిన అంతర్జాతీయ కామన్వెల్త్ పార్లమెంటరీ సదస్సులోను, 1954లో న్యూయార్కులో జరిగిన ఇంటర్నెషనల్ పెజెంట్ యూనియన్, 1955లో టోక్యోలో జరిగిన ఆసియన్ కాంగ్రెస్ ఫర్ వరల్డ్ గవర్నమెంటు లోను భారత దేశం తరఫున ప్రతినిధిగా పాల్గొన్నారు.

స్వాతంత్ర్యానంతరం తొలి ఎన్నికలు వచ్చేనాటికి ముఠా తగాదాల కారణంగా రంగా కాంగ్రెస్ పార్టీ నుంచి బయటకు వచ్చి కృషీకార్ లోక్ పార్టీ స్థాపించారు. ఆ ఎన్నికలలో చిత్తూరు, శ్రీకాకుళం జిల్లాల్లో మాత్రమే కృషీకార్ లోక్ పార్టీ అభ్యర్థులు గెలిచారు. తరువాత సహకార రంగ వ్యవసాయానికి బద్ధ వ్యతిరేకి అయిన రాజాజీతో కలిసి స్వతంత్ర పార్టీని స్థాపించారు. రంగా స్వతంత్ర పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులై ఒక దశాబ్దం పాటు నిర్వహించారు. 1962 సార్వత్రిక ఎన్నికలలో పార్టీ 25 స్థానాలలో గెలిచి బలమైన ప్రతి పక్షముగా రూపుదిద్దు కొన్నది. 1972లో రంగా తిరిగి కాంగ్రెస్ (ఐ)లో చేరి, ఇందిరా గాంధీ కి సన్నిహితులై చివరి వరకూ కాంగ్రెస్ లోనే కొనసాగారు. నెహ్రూ నాయకత్వాన్ని, ఆయన ప్రతిపాదించిన సహకార వ్యవసాయాన్ని కాదని దేశ వ్యాప్తంగా స్వతంత్ర పార్టీ ఏర్పడగా, దానికి తొలి అధ్యక్షులుగా ఆచార్య రంగా ఉన్నారు. రాజగోపాలా చారి, మినూ మసానీ, పీలూ మోడీ, రత్నస్వామి, బెజవాడ రామచంద్రా రెడ్డి మొదల్కెనవారు ఎందరో రంగాతో చేతులు కలిపారు. కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా ఏర్పడిన పార్టీలో డాక్టర్ మర్రి చెన్నారెడ్డి కూడా తొలిదశలో ఉన్నారు. క్రమేణా స్వతంత్ర పార్టీకి రంగా దూరం అవుతూ వచ్చారు. జాతీయ నాయకులలో అంబేద్కర్‌తో రంగా సన్నిహితంగా ఉండేవారు. రాజ్యాంగ సభకు అంబేద్కర్ పేరును ప్రతిపాదించడంలో ఆయన కీలకపాత్ర వహించారు. ఆంధ్రలో సంస్కరణ వివాహాలను రంగా ప్రోత్సహించారు. 1952 నుండి 62 వరకు తెనాలి, 62 నుండి 67 వరకు చిత్తూరు, 67 నుండి 70 వరకు శ్రీకాకుళం, 80 నుండి 84, 84 నుండి 89 వరకు, 89 నుండి 91వరకు మూడుసార్లు వరుసగా గుంటూరు లోకసభ నియోజకవర్గ స్థానాలకు ప్రాతినిథ్యం వహించారు. 1946లో కోపెన్ హేగన్‌లో జరిగిన వ్యవసాయ సమాఖ్యలో పాల్గొన్నారు. 1952లో కామన్వెల్త్ పార్లమెంటరీ సమావేశంలో పాల్గొని అటావా నగరంలో ప్రసంగించారు. 1954లో న్యూయార్క్‌లో జరిగిన అంతర్జాతీయ రైతు సమాఖ్యలో ప్రధానోపన్యాసం చేశారు. 1955లో టోక్యోలో జరిగిన 'ఏషియన్ కాంగ్రెస్ ఫర్ వరల్డ్ గవర్నమెంట్' సభలో సుదీర్ఘోపన్యాసం చేశారు. రైతు సమస్యల్ని అంతర్జాతీయ సభ ల దృష్టికి తీసుకువచ్చారు. పొగాకు, పత్తి రైతుల, చేనేత కార్మికుల సమస్యలకు అధిక సమయాన్ని వినియోగించారు. ఇంగ్లీషులోనూ, తెలుగులోనూ పుంఖాను పుంఖంగా రచనలు చేశారు. రైతులు విప్లవోద్యమాలలో నిర్వహించిన పాత్రను అధ్యయనం చేసి రివల్యూషనరీ పెజంట్స్, ది క్రెడో ఆఫ్ వరల్డ్ పెజంట్స్ అనే గ్రంథాలు రాశారు. రంగా సుదీర్ఘ కాలం పార్లమెంట్ సభ్యునిగా రికార్డు సృష్టించి, గిన్నీస్ బుక్‌లోకి ఎక్కారు. సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఎలాంటి పదవులు లేకుండా ప్రతిష్ఠాత్మకమ్మైన నీతివంతమ్మైన రాజకీయాన్ని పాటించి,95 సంవత్సరాల వయస్సులో ఆయన అనారోగ్యంతో 1995 జూన్ 9వ తేదీన నిడుబ్రోలులోని ఆయన స్వగృహమైన గోభూమిలో తుది శ్వాస విడిచారు.

# నోటాకు ప్రాధాన్యత ఇవ్వండి!

ప్రజల కోసం, ప్రజల వలన, ప్రజల చేత ఏర్పాటైన ప్రభుత్వాలు ప్రజల శ్రేయస్సు కోరి పని చేయాలి. ఒకసారి ఎన్నికైన తర్వాత అయిదేళ్ల వరకూ తమను ఎవరూ ఏమీ చేయలేరని ఇష్టం వచ్చినట్లుగా ప్రవర్తిస్తూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. ఒక నియంత లాగా వ్యవహరిస్తున్నారు. దీంతో పనులు చేసుకునే సామాన్య ప్రజానీకం ఇబ్బందికి గురవుతున్నారు. స్వాతంత్ర్యం రాక పూర్వం మన దేశ ప్రజలకు అధికారం గురించి తెలియదు. ఎందరో త్యాగమూర్తుల ఫలితంగా ఎన్నో పోరాటాల ద్వారా వచ్చిన స్వాతంత్ర్యం అనంతరం, ఒక్కసారిగా వచ్చిన అధికారాలతో ఎక్కువ మంది అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు. నేరుగా స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న వారు తప్ప మిగతా పరిపాలకులు పాలనలో గొప్ప మార్పులు తీసుకురాలేక పోయారు. వలస పాలకుల ప్రభావం, మన నిరక్షరాస్యత తోడుగా పేదరికంతో ప్రజలు ఇతరుల మభ్యపెట్టే మాటలతో, పలుకుబడితో వచ్చిన వారి మాటలను విని ఓటు వేసేవారు. మోసపోయే వారు. అభివృద్ధికి నోచుకోక మనం చాలా కాలం వృధా చేసుకున్నాం. కానీ ప్రస్తుత కాలంలో బాగా మార్పులు కనబడుతున్నాయి. ప్రజలు సైలెంట్‌గా ఎగ్జిట్ పోల్స్‌కు అందని విధంగా తీర్పును ఇస్తున్నారు.

పోటీలో ఉన్న అభ్యర్థులు మనకు ఇష్టం లేకుంటే మన భారత ఎన్నికల సంఘం 'నోటా' కు ఓటు వేసే సదుపాయం 2013 సంవత్సరంలో కల్పించిందని తెలిసిన విషయమే. అయితే భారత ఎన్నికల సంఘం 'నోటా'కు ఎక్కువ ఓట్లు పోల్ అయినప్పటికీ తర్వాత శ్రేణిలో ఉన్న ఎక్కువ ఓట్లు సాధించిన అభ్యర్థిని గెలిచినట్లుగా ప్రకటిస్తున్నారు. అంటే పోలైన 100 ఓట్లలో 'నోటా'కు 90 ఓట్లు పోలైనా, పోటీలో ఉన్న మిగతా అభ్యర్థులలో ఎక్కువ వచ్చిన వారిని గెలిసినట్లుగా ప్రకటిస్తారు. దీంతో ఓటర్ల ఉత్సుకత, ఉద్దేశం పూర్తవ్వడం లేదు. దీంతో ఎన్నికలకు దూరమయ్యే ప్రమాదం లేకపోలేదు. పార్టీలన్నీ కూడా నేరచరితులను, సేవాభావం లేని వారిని అభ్యర్థులుగా ప్రకటించడంతో ఓటర్ల నిర్లిప్తతతో ముఖ్యంగా నగరాలలో పోలింగ్ శాతం నమోదుకావడం లేదు. పోటీలో ఉన్న అభ్యర్థుల కంటే 'నోటా'కు ఎక్కువ ఓట్లు నమోదైనట్లయితే ఓటర్లు పోటీలో ఉన్న అభ్యర్థులందరినీ తిరస్కరించినట్లే. కాబట్టి మన ప్రజాస్వామ్యంలో ఓటుకు విలువనిస్తూ తిరిగి కొత్త అభ్యర్థులతో మళ్ళీ ఎన్నికలు నిర్వహించాలి. ఇప్పటికే మహారాష్ట్ర, హర్యానా, ఢిల్లీ స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఆయా రాష్ట్ర ఎన్నికల కమిషనర్లు ఆదేశాలు ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఎన్నికల్లో కల్పిత అభ్యర్థిగా 'నోటా'కు కనుక శక్తి చేకూరితే ఆయా పార్టీల వారు తమ అభ్యర్థులను ప్రకటించేముందు జాగ్రత్త పడతారు. 2024 మూడవ విడత పార్లమెంటు ఎన్నికల్లో సూరత్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఒక పార్టీ అభ్యర్థి నామినేషన్‌ను తిరస్కరించడంతో మిగతా స్వతంత్ర అభ్యర్థులు కూడా వారి నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. దీంతో విత్‌డ్రా చేసుకోని పార్టీ అభ్యర్థి ఒక్కరే పోటీలో ఉండడంతో అక్కడి ఎన్నిక ఏకగ్రీవమైంది. కొంతమంది నామినేషన్లు ఉపసంహరించుకోవడంతో, ఒక పార్టీ అభ్యర్థి నామినేషన్‌ని తిరస్కరించడంతో ప్రజాస్వామ్యవాదులు ఎన్నికైన అభ్యర్థిపై అయిష్టత చూపుతున్నా అక్కడి ఓటర్లు, విద్యావంతులు రాజ్యాంగం కల్పించిన తమ ఓటు హక్కును వినియోగించుకోలేక పోయామని తీవ్రంగా వ్యతిరేకించడం జరిగింది. 'నోటా'ను ఒక కల్పిత అభ్యర్థి కింద పరిగణించి ఎన్నిక జరిపితే 'నోటా' కంటే పోటీలో ఉన్న ఆ ఒక్క అభ్యర్థికి ఓట్లు ఎక్కువగా వస్తే గెలిచినట్లుగా ప్రకటించాలని లేదా 'నోటా'కు ఆ అభ్యర్థి కంటే ఎక్కువ వచ్చినట్లయితే ఆ ఎన్నిక చెల్లకూడదని మళ్ళీ ఎన్నికలు జరపాలని ప్రముఖ రచయిత శివ ఖేర సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి వై.వి. చంద్రచూడ్ దానిని ఎన్నికలకు సంబంధించిన విషయమని చెప్పి ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు పంపించారు. ప్రస్తుతం ఆ అంశం వారి పరిశీలనలో ఉన్నట్లుగా భావిద్దాం.

ఈ లోక్‌సభ ఎన్నికలలో 'నోటా'కు ఓటు వేయడం వలన ప్రయోజనం లేదని ఓటర్లు భావించడంతో 'నోటా'కు ఓటు పర్సెంటేజ్ పెరగలేదు. అయితే ఇప్పటికే లోకల్ బాడీ ఎన్నికలకోసం అమల్లో ఉన్న మహారాష్ట్ర, హర్యానా రాష్ట్రాలు, ఢిల్లీ, పుదుచ్చేరి కేంద్ర పాలిత ప్రాంతాల మాదిరిగా మన రాష్ట్రంలో కూడా రాబోయే పంచాయతీ ఎన్నికలలో 'నోటా'ను ఒక కల్పిత అభ్యర్థిగా పరిగణించి ఎన్నికల ఫలితాలను వెలువరించాలి. దాంతో ఓటు నమోదు శాతం పెరుగుతుంది. ఓటు పోలింగ్ శాతం పెరుగుతుంది. ఎన్నికల ఖర్చు అరికట్టినట్లవుతుంది. ఎన్నికల్లో అభ్యర్థుల కోసం వేలం పాటలను అరికట్టవచ్చును. అప్పుడే సామాన్యుడు ఎన్నికల్లో పోటీలో ఉండే అవకాశాలుంటాయి. ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ అధ్యక్షులు యం. పద్మనాభరెడ్డి ఆధ్వర్యంలో ఈ విషయంపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌ను కలసి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. అన్ని రాజకీయ పార్టీలకు కూడా ప్రతులు పంపడం జరిగింది. "రేపు రాబోయే కాలంలో 'నోటా'కు ఒక ప్రాధాన్యత కలిగిస్తే రాబోయే ఎన్నికలలో రాజకీయపార్టీల అభ్యర్థులకు టికెట్లు ఇవ్వడం ఒక పెద్ద ఛాలెంజ్ అవుతుంది."

# చేప మందుపై పునరాలోచించాలి

నేటి కాలమాన పరిస్థితుల్లో మానవ సమాజాన్ని అనేక రోగాలు చుట్టుముడుతున్నాయి. అనేక రోగాలకు ఆధునిక వైద్య విధానంతో నయం జరుగుతోంది. అయినా కొన్ని రోగాలు ఏలాంటి మందులకు లొంగవు. అవీ రోగనిరోధక శక్తిని దాటి దీర్ఘకాలిక జబ్బుగా మారి మానవ సమాజాన్ని చిన్నాభిన్నం చేస్తున్నాయి. అలాంటిదే ఆస్తమా. ఇది భయంకరమైన వ్యాధి కోవకు చెందినదే. ఈ వ్యాధిని నయం చేయడానికి ఆయుర్వేద వైద్యం పేరుతో తెలంగాణలో చలామణి అవుతున్న చేప మందు ప్రసాదం విస్తృతంగా ప్రచారంలో ఉంది. దీన్ని ప్రతి ఏటా బత్తిన సోదరులు మృగశిర కార్తె రోజు పంపిణీ చేస్తున్నారు. ముఖ్యంగా ఉబ్బసం వ్యాధి గ్రస్తులకు ఇది దివ్య ఔషధంగా చెప్తారు. ఈ ఏడాది జూన్ 8,9 తేదీల్లో హైదరాబాద్ లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో పంపిణీ జరగనుంది. ఈ మందు కోసం తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి జనాలు వస్తుంటారు. ఇందుకు ప్రభుత్వం సైతం అధికారికంగా ఏర్పాట్లు చేస్తుంది. అయితే, ఎన్ని ఏర్పాట్లు చేసినా రద్దీ ఎక్కువై విపరీతమైన కాలుష్యం ఏర్పడుతుంది. తద్వారా వ్యాధి మరింత పెరగవచ్చని నిపుణులంటున్నారు.

వాస్తవంగా వర్షాకాలం ప్రారంభం కాగానే ఆస్తమా వ్యాధిగ్రస్తులు అనేక అవస్థలు పడుతుంటారు. ఈ సమయంలో ఉపశమనం కోసం వారిలో ఏ మందు ఇచ్చినా వేసుకునే బలహీనత ఏర్పడుతుంది. దీన్ని ఆసరాగా చేసుకుని చేప మందు ఆస్తమా వ్యాధిని తగ్గిస్తుందని బత్తిని సోదరులు ప్రచారం చేసుకుంటూ ఏళ్ళ తరబడి నుంచి పంపిణీ చేస్తున్నారు. ఈ చేప మందులో ఉబ్బసాన్ని తగ్గించే మందు ఏది లేదని ప్రయోగశాలలో ప్రయోగపూర్వకంగా నిర్ధారించబడింది. ఈ క్రమంలో జన విజ్ఞాన వేదిక గతంలో అనేక సార్లు రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. ఈ మందుపై సిటీ సివిల్ కోర్టు 2012లో దీనిని మందు అనొద్దని ఈ మిశ్రమాన్ని "చేప ప్రసాదం" గా వ్యవహరించాలని తీర్పును వెలువరించింది. అంతేకాకుండా చేప ప్రసాదం తయారీ, పంపిణీ పరిశుభ్రమైన వాతావరణంలో వైద్య, ఆరోగ్య శాఖ అధికారుల పర్యవేక్షణలో జరపాలని ఆదేశించింది. దీన్ని ఎక్కడ పాటించడం లేదు. చేప ప్రసాదాన్ని ఎక్కడా "చేప మందు"గా ప్రచారం చేయరాదని, వీటిని ఉల్లంఘించిన పక్షంలో సర్కారు వెంటనే చర్యలు తీసుకోవాలని కూడా ఆదేశించింది. సైంటిఫిక్ అథారిటీ లేని చేపమందు ప్రసాదం పంపిణీపై 2019లో మరోసారి హైకోర్టులో పిటిషన్ కూడా దాఖలైంది.

ఆస్తమా అనేది దీర్ఘకాలమైన జబ్బు దీనికి ఎప్పుడు చికిత్స జరుగుతూ ఉండాలి. ఆస్తమాను తొలి దశలో గుర్తిస్తే చికిత్స సులువవుతుంది. ప్రతి ఆయాసం అస్తమా కాదు. ఆయాసం, దగ్గులకు అనేక కారణాలు ఉండవచ్చు. వాటిని తెలుసుకొని ఆధునిక చికిత్స పొందవలసిన అవసరం ఉందని వైద్యులు సూచిస్తున్నారు. ఆస్తమాకు ప్రస్తుతమున్న వైద్య విధానంలో ఉపశమనమే తప్ప పూర్తి నివారణ అంత తేలిక కాదు. అయినా ఆత్మవిశ్వాసంతో, దృఢ సంకల్పంతో సరైన అవగాహనతో ఆధునిక చికిత్సా విధానంతో అస్తమాను జయించవచ్చని వైద్య నిపుణులంటున్నారు. కాబట్టి చేప ప్రసాదం పంపిణిపై ప్రభుత్వం పునరాలోచించాలి. ఏర్పాట్ల కోసం ప్రజాధనాన్ని వృధా చేయవద్దు. అంతేకాకుండా మత్స్య శాఖ చేప పిల్లల సరఫరాను నిలిపివేయాలి. ఇటీవల భారతదేశంలో సూడో సైన్స్ (అసత్య సైన్స్) ప్రచారం విస్తృతంగా పెరుగుతుంది. పతంజలి ఉత్పత్తులపై తప్పుదారి పట్టించే ప్రకటనలపై సర్వోన్నత న్యాయస్థానం తీవ్రంగా పరిగణించిన విషయం తెలిసిందే. ఇలాంటివి ప్రజలను గందరగోళానికి గురి చేస్తాయి.

ప్రపంచంలో ఎక్కడలేని చేప ప్రసాదం భారత్ లోనే ఎలా చలామణి అవుతోందో ప్రజలు కూడా ఒక్కసారి ఆలోచించాలి. ఆస్తమా వ్యాధికి అన్ని జిల్లా కేంద్ర, ఏరియా ఆసుపత్రిలో నిపుణులతో చికిత్స శిబిరాలను ఏర్పాటు చేయాలి. ఆస్తమా వ్యాధి నివారణకు, చికిత్సకు ఉన్న ఆధునిక వైద్య విధానాలను ప్రజలకు వివరించాలి. గుడ్డిగా నమ్మడం, మూఢ నమ్మకాలు ప్రోత్సహించడం ప్రభుత్వ విధానంగా ఉండకూడదు.

అదేవిధంగా రాజ్యాంగంలో ఆర్టికల్ 51ఈా(ఎ) ప్రకారం ప్రజల్లో శాస్త్రీయ దృక్పథాన్ని, పరిశోధన, సంస్కరణ స్ఫూర్తిని పెంపొందింప చేయాలి. ఆస్తమా వ్యాధి లక్షణాలు, ఆస్తమా వ్యాధికి వ్యాప్తి గల కారణాలను ప్రజలకు అవగాహన కల్పించి, నివారణ మార్గాలను తెలియజేయాలి. అప్పుడు ఇలాంటి సైన్స్ లేని మందులకు ప్రజలు దూరంగా ఉంటారు.

# సెఫాలజిస్టులను నమ్మితే అమాయకత్వమే..!

ఎన్నికల ముందు మచ్చుకు కొంత మంది ఓటర్లతో మాట్లాడి, దాని ఆధారంగా ముందే ఫలితాలు ఎలా ఉంటాయో చెప్పే శాస్త్రాన్ని 'సెఫాలజి' అంటారు. ఈ ఎన్నికల్లో సెఫాలజిస్టులు ప్రకటించిన ఫలితాలు అంచనాలకి విరుద్ధంగా వచ్చాయి.యాక్సిస్ మై ఇండియా ప్రదీప్ గుప్తా తాము ప్రకటించిన అంచనాలు వాస్తవ ఫలితాలకు దూరంగా ఉ ఒడటంతో బహిరంగంగానే ఉద్వేగానికి లోనై కంటతడి పెట్టుకున్నారు. 'ప్రజల నాడి' నిజానికి ఎవరికీ తెలియదు, తెలియరాదు. అది ఒక చాలా సంక్లిష్ట విషయం. కొంత మందితో మచ్చుకి మాట్లాడి దాని ఆధారంగా ఒక అంచనాకు రావచ్చు. కానీ అదే నిజం అవుతుందని భావించడం తార్కికం కాదు, సహేతుకం కాదు. ఎవరైనా అలా నిజంగా నమ్మితే అది వారి అమాయకత్వం అనుకోక తప్పదు. ఎన్నికల సమయంలో ఇంచుమించు అన్ని రాజకీయ పక్షాలు తాము భారీ ఓట్లతో, సీట్లతో గెలుస్తామని చెబుతాయి. తమకు ప్రజల నాడి తెలుసనీ, దాని ఆధారంగా ఈ మాట చెబుతున్నామని సమర్థించుకుంటాయి. రాజకీయ పక్షాలు అలా చెప్పడానికి కారణం, బహుశా నాయకుల చుట్టూ ఉండే వందిమాగధులు అయి ఉండవచ్చు. రాజరిక వ్యవస్థ భౌతికంగా పోయినా సరే, మానసికంగా ఇది ఇంకా మన దేశంలో అంతరించిపోలేదు. రాజులు పోయి రాజకీయ నేతలు వచ్చారు. ఈ నాయకుల చుట్టూ శ్రేయోభిలాషులు, బంధువులు, హితులుగా కనిపించేవారు కొంతమంది వందిమాగధులుగా, మారి నేతలను ఆకాశానికి ఎత్తేస్తుంటారు. ఓటమికి ఇది ఒక కారణం కావచ్చు. తప్పక గెలుస్తామని చెప్పడానికి రెండో కారణం... అలా చెప్తే తటస్థ ఓటర్లు తమ వైపు మొగ్గు చూపవచ్చుననే నమ్మకం కావచ్చు. కానీ అసలు ఫలితాలు మాత్రం పరిస్థితులను అర్థం చేసుకున్న సామాన్య జనులకు సైతం తెలియాలి. 'ప్రజల నాడి' నిజానికి ఎవరికీ తెలియదు, తెలియరాదు. అది ఒక చాలా సంక్లిష్ట విషయం. కొంత మందితో మచ్చుకి మాట్లాడి దాని ఆధారంగా ఒక అంచనాకు రావచ్చును. కానీ అదే నిజం అవుతుందని భావించడం తార్కికం కాదు, సహేతుకం కాదు. ఎవరైనా అలా నిజంగా నమ్మితే అది వారి అమాయకత్వం అనుకోక తప్పదు. సెఫాలజి అనేది సాంఖ్యక శాస్త్రం, సంభావ్యత అన్న భావనలు మీద ఆధార పడుతుంది. సంభావ్యత అనేది చాలా లోతైన, గంభీరమైన విషయం. ఈ విషయంలోనే అసలు గందరగోళం ఉంది. సంభావ్యతని కొంచెం పైపైన మాత్రమే నేను వివరిస్తాను. సంభావ్యత అర్థం తెలుసుకోవడానికి ఉపకరించేటట్టు. పది నాణేలను ఒకేసారి పైకి విసిరామనుకోండి. అప్పుడు తలలు (హెడ్స్) పైకి 1 నుంచి 10 వరకు రావచ్చు కదా! ఎన్ని తలలు పైకి వచ్చాయో రాసుకోండి. ఇలా ఈ ప్రయోగం (10 నాణేలను ఒకేసారి పైకి విసిరడం, తలల లెక్క రాసుకోవడం) చాలా సార్లు చేసామనుకోండి. ఉదాహరణకి వెయ్యి సార్లు అనుకుందాం. సరిగ్గా నాలుగు తలలు ఎన్ని సార్లు పైకి వచ్చాయో, శాతం పరంగా చెబితే దాన్ని, 4 తలలు పైకి వచ్చే ఘటన తాలూకు సంభావ్యత అంటాము. దీనిలో కొంత అనిశ్చితి దాగి ఉందని మనం మరిచి పోగూడదు. 'అసత్యాలు, హేయమైన అసత్యాలు, గణాంకాలు' అనేది బలహీనమైన వాదనలు, అనువర్తిత గణాంకాలపై విమర్శలను బలపరిచేందుకు వాడే పదబంధం. 'అమెరికన్ సాహిత్య పిత' అని పేర్కొంటున్న మార్క్ ట్వైన్, గణాంకాలకి వ్యతిరేకంగా పై విధంగా వ్యాఖ్యానించారు అని చెబుతారు. ఆయన గణితజ్ఞుడు కాదు, శాస్త్రవేత్త కాదు, అయినా సరే, విజ్ఞుడు కాబట్టి గణాంకాల ప్రవాహంలో కొట్టుకుపోలేదు. గణాంకాల పరిమితులను, అవధులను గుర్తించగలిగి, అలా చమత్కారంగా ఛలోక్తి విసిరారు.

# స్యామ్‌సంగ్ ఉద్యోగులు ఉద్యమబాట



సియోల్ : దక్షిణ కొరియాలోని స్యామ్‌సంగ్ ఎలక్ట్రానిక్స్ ఉద్యోగులు ఉద్యమబాట పట్టారు. వేతన పెంపు కోరుతూ నిరసనలు చేపట్టారు. అనేక మంది ఉద్యోగులు మూకుమ్మడి సెలవులు పెట్టి తమ ఆందోళన కొనసాగిస్తున్నారు. దాదాపు 10 మంది కార్మికులకు ప్రాతినిధ్యం వహిస్తున్న నేషనల్ స్యామ్‌సంగ్ ఎలక్ట్రానిక్స్ యూనియన్ (ఎన్ఎస్ఇయు) ఆధ్వర్యంలో సియోల్‌లోని స్యామ్‌సంగ్ ప్రధాన కార్యాలయం వద్ద కూడా పలువురు ఉద్యోగులు నిరసన తెలిపారు. 'శ్రమను గౌరవించండి!, మేమేమీ గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదు. న్యాయబద్ధమైన వేతనాలు ఇవ్వండి చాలు' అంటూ నినాదాలు చేశారు. పెద్ద సంఖ్యలో ఉద్యోగులు మూకుమ్మడి సెలవులు తీసుకున్నారని, ఆందోళన క్రమంగా విస్తరిస్తోందని ఎన్ఎస్ఇయు అధ్యక్షులు సోన్ వూమెక్ మీడియాకు తెలిపారు. వేతనాల పెంపుపై జనవరి నుంచి కార్మికుల యూనియన్, యాజమాన్యం మధ్య చర్చలు జరుగుతున్నాయి. ఈ ఏడాది ఇప్పటికే 5.1 శాతం వేతన పెంపును అమలు చేశామని, కానీ యూనియన్లు అదనపు రోజు వార్షిక సెలవు, పనితీరు ఆధారిత బోనస్‌లు కోరుతున్నాయని యాజమాన్యం వాదిస్తోంది. అయితే కార్మికుల సమ్మె కారణంగా ఉత్పత్తిపై ఎలాంటి ప్రభావం లేదని యాజమాన్యం చెబుతుంది. అయితే స్యామ్‌సంగ్‌లో కార్మికుల సమ్మె చాలా అరుదైన విషయమని విశ్లేషకులు చెబుతున్నారు. స్యామ్‌సంగ్‌లో సుమారు 50 ఏళ్ల పాటు కార్మికుల యూనియన్లను నిషేధించారు. అయితే 2010లో అప్పటి దేశ అధ్యక్షులు మూన్ జె-ఇన్ చొరవ కారణంగా యూనియన్లు ఏర్పాటయ్యాయి. ఎన్ఎస్ఇయులో 28 వేల ఉద్యోగులు ఉన్నారు. ఇది మొత్తం స్యామ్ సంగ్ శ్రామిక శక్తిలో ఐదో వంతుతో సమానం. అలాగే సంస్థలో ఉన్న ఐదు యూనియన్లలో ఇదే అతి పెద్దది. సమ్మె గురించి యూనియన్ల నాయకులు మాట్లాడుతూ సమ్మెతో ఉత్పత్తికి అంతరాయం కలిగించమని, అది మా ఉద్దేశ్యం కాదని చెప్పారు.

# కేజ్రీవాల్ పేరుని తెరపైకి తెచ్చిన పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్



పాక్ మాజీ ప్రధాని అనూహ్యంగా ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ పేరుని తెరపైకి తెచ్చారు. ఈ విషయం కాస్తా.. చర్చనీయాంశంగా మారింది.ఓ కేసులో పాకిస్థాన్ సుప్రీంకోర్టు ఎదుట హాజరైన ఇమ్రాన్ ఖాన్ కేజ్రీవాల్ గురించి మాట్లాడారు. భారత్ లో లోక్ సభ ఎన్నికల కోసం కేజ్రీవాల్ కు బెయిల్ దక్కిందని వ్యాఖ్యానించారు. కానీ, ఇక్కడ తాను మాత్రం అణచివేతకు గురవుతున్నాని.. జైళ్లో తనతో దారుణంగా వ్యవహరిస్తున్నారని పేర్కొంది. 'నేషనల్ అకౌంటబిలిటీ ఆర్డినెన్స్'లో సవరణలకు సంబంధించిన కేసులో విచారణకు ఇమ్రాన్ ఖాన్ సుప్రీంకోర్టుకు హాజరయ్యారు. 2022లో అధికారం పోయినప్పట్నుంచి తాను ఎదుర్కొన్న పరిస్థితుల గురించి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరి 8న జరిగిన పాక్ సార్వత్రిక ఎన్నికలకు తనను దూరం చేసేందుకే 5 రోజుల్లోనే ఓ కేసులో దోషిగా తేల్చారన్నారు. కేసు విచారణను లైవ్ టెలికాస్టింగ్ చేయాలన్న వినతిని సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఈ తీర్పుపైనా ఇమ్రాన్ అసహనం వ్యక్తం చేశారు. కోర్టులోపాలిటిక్స్ మాట్లాడనని తీర్పు పేర్కొన్నారని ఇమ్రాన్ ఖాన్ నిరాశ వ్యక్తం చేశారు. అసలు తానే మాట్లాడానని ప్రశ్నించారు. అయితే.. ఈ తీర్పుపై ఎవరికీ వివరణ ఇవ్వాల్సిన అవసరం లేదని జడ్జి పేర్కొన్నారు. దీనిపై రివ్యూ పిటిషన్ వేయొచ్చని సూచించారు. పెండింగ్ అంశాలపైనే కోర్టులో మాట్లాడాలని జడ్జి ఘాటుగా స్పందించారు.

# ఉన్నావ్ బాధితురాలి తండ్రి హత్య కేసు




న్యూఢిల్లీ : ఉన్నావ్ అత్యాచార బాధితురాలి తండ్రి హత్య కేసులో బిజెపి నాయకుడు కుల్దీప్ సెంగార్‌కు విధించిన 10 ఏళ్ల జైలు శిక్షను రద్దు చేయడానికి ఢిల్లీ హైకోర్టు శుక్రవారం నిరాకరించింది. ప్రస్తుత దశలో శిక్షను రద్దు చేయడానికి కోర్టు అనుకూలంగా లేదు, సెంగార్ పిటీషన్‌ను కొట్టివేస్తున్నామని జస్టిస్ స్వరణ కాంత శర్మ తీర్పులో పేర్కొన్నారు. ఇప్పటికే 6 ఏళ్ల శిక్షను అనుభవించానని, మిగిలిన శిక్షను రద్దు చేయాలని సెంగార్ తన పిటీషన్‌లో కోరారు. దీనికి జడ్జి 'శిక్షను రద్దు చేయడంపై నిర్ణయం తీసుకునే సందర్భంలో నేర స్వభావం, నేర తీవ్రత, నేరంలో దోషి పాత్ర వంటి అంశాలు ఆధారంగా నిర్ణయం తీసుకుంటాం. కేవలం జైలుల్లో గడిపిన కాలం ఆధారంగానే నిర్ణయం తీసుకోం' అని స్పష్టం చేశారు. అలాగే హత్యకు గురైన వ్యక్తి మైనర్ కుమార్తెపై అత్యాచారం కేసులో సెంగార్ ట్రయల్‌కోర్టులో దోషిగా నిర్ధారించబడి, అతనికి జీవిత ఖైదును విధించిన విషయాన్ని కోర్టు గుర్తు చేసింది. ఉన్నావ్ అత్యాచార కేసులో ట్రయిల్ కోర్టు విధించిన శిక్షను సవాల్ చేస్తూ సెంగార్ వేసిన పిటీషన్ ఈ హైకోర్టులోనే విచారణలో ఉంది. 2017లో ఉత్తరప్రదేశ్‌లోని ఉన్నావ్‌లో మైనర్ బాలికపై జరిగిన అత్యాచర ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. తరువాత 2018, ఏప్రిల్ 9న బాలిక తండ్రి పోలీసు కస్టడీలో మరణించాడు. బిజెపి నాయకుడు సెంగార్ ఆదేశాల మేరకే బాలిక తండ్రిని పోలీసులు అరెస్టు చేశారని, పోలీసుల దెబ్బల కారణంగానే మృతిచెందాడని కోర్టు నిర్ధారించింది. 2020, మార్చి 13న ఈ కేసులో ట్రయల్ కోర్టు సెంగార్‌కు 10 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ. 10 లక్షల జరిమానా విధించింది.

# జమ్ముకాశ్మీర్‌లో ప్రారంభమైన అసెంబ్లీ ఎన్నికల కసరత్తు



శ్రీనగర్: జమ్ముకాశ్మీర్‌లో ఎన్నికల కమిషన్ అసెంబ్లీ ఎన్నికల కసరత్తును అధికారికంగా ప్రారంభించింది. ఇసి కార్యదర్శి జయదేబ్ లాహిరి శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. జమ్ము మరియు కాశ్మీర్ కేంద్రపాలిత ప్రాంత శాసన సభకు సాధారణ ఎన్నికల కోసం ఎన్నికల చిహ్నాల (రిజర్వేషన్ అండ్ అలాట్‌మెంట్) ఆర్డర్ 1968లోని పారా 10బి కింద ఉమ్మడి గుర్తును కేటాయించాలన్న దరఖాస్తులను తక్షణమే ఆమోదించాలని కమిషన్ నిర్ణయించినట్లు ఆయన పేర్కొన్నారు. జమ్ము కాశ్మీర్ ప్రజలు త్వరలో ప్రజాస్వామ్యయుతంగా ప్రభుత్వాన్ని ఎన్నుకుంటారని ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) రాజీవ్ కుమార్ ఇటీవల ప్రకటించిన సంగతి తెలిసిందే. 2014లో జమ్ముకాశ్మీర్‌లో చివరిసారిగా అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ముఫ్తీ మహ్మద్ సయీద్ నేతృత్వంలో బిజెపి, పిడిపి సంకీర్ణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. 2016లో ముఫ్తీ మహ్మద్ సయీద్ మరణించడంతో ఆయన కుమార్తె మెహబూబా ముఫ్తీ సంకీర్ణ ప్రభుత్వానికి నేతృత్వం వహించారు. 2019 సంకీర్ణ ప్రభుత్వం నుండి బిజెపి వైదొలగడంతో ముఫ్తీ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. అనంతరం గవర్నర్ పాలన తర్వాత రాష్ట్రపతి పాలన విధించింది. 2019లో మోడీ ప్రభుత్వం జమ్ముకాశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పించే ఆర్టికల్ 370, 35ఎ లను రద్దు చేయడంతో పాటు కేంద్రపాలిత ప్రాంతంగా ప్రకటించింది. అప్పటి నుండి కేంద్రపాలిత ప్రాంతం లెఫ్టినెంట్ గవర్నర్ నేతృత్వంలో ఉంది.

# రష్యాలో ఘోర విషాదం..

రష్యాలో ఘోర విషాదం జరిగింది. నలుగురు భారతీయ వైద్య విద్యార్థులు నదిలో గల్లంతయ్యారు. వెలిక్ నోవ్గోరోడ్ లోని యూనివర్సిటీలో చదువుతున్న మహారాష్ట్రకు చెందిన నలుగురు స్టూడెంట్స్ విహారయాత్రకు వెళ్లి నదిలో మునిగి చనిపోయారు.మరొకరు ప్రాణాలతో బయటపడ్డారు. ఆ ఐదుగురు విద్యార్థులు వోలో?వ్ నది వెంబడి వాకింగ్ కు వెళ్లిన సమయంలో ఈ ఘటన జరిగింది. స్థానిక ఎమర్జెన్సీ సర్వీసెస్ ఇప్పటి వరకు ఒక డెడ్ బాడీని వెలికితీసింది. మరో ఇద్దరి మృతదేహాల కోసం గాలిస్తోంది. ఈ ప్రమాదంలో చనిపోయిన నలుగురు విద్యార్థులు మహారాష్ట్రలోని జల్గావ్ జిల్లాకు చెందిన వారని విదేశాంగ శాఖ తెలిపింది. ప్రాణాలతో బయటపడిన మరో విద్యార్థిది కూడా అదే ప్రాంతమని వివరించింది. మృతులు హర్షల్ అనంతరావు దేసాలే, జిషాన్ అష్పక్ పింజారీ, జియా ఫిరోజ్ పింజారీ, మాలిక్ గులాంగౌస్ మహ్మద్ యాకూబ్ గా గుర్తించారు. ప్రాణాలతో బయటపడిన స్టూడెంట్ నిషా భూపేశ్ సోనావానే. వీరంతా 18 నుంచి 20 ఏళ్ల లోపు వారే కావడం గమనార్హం. ఈ ప్రమాదంలో ప్రాణాలతో బయటపడిన విద్యార్థిని నిషా కు చికిత్స అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. వోలా?వ్ నది వెంబడి వాకింగ్ కు వచ్చిన విద్యార్థులకు నదిలో కాసేపు ఈత కొట్టాలనుకున్నారు. ఆ టైంలో విద్యార్థుల్లో ఒకరైన జిషాన్ పింజరి తన పేరెంట్స్ తో వీడియో కాల్ లో ఉన్నారు. వోలో?వ్ నదిలోకి దిగగానే జిషాన్ తన కుటుంబ సభ్యులకు వీడియో కాల్ చేశాడు. అతని తండ్రి, ఇతర కుటుంబ సభ్యులు జిషాన్ ను, అతడి స్నేహితులను నదిలో నుంచి బయటకు రావాలని కోరారు వారు అలా చెప్తూ ఉండగానే.. పెద్ద అల ఒక్కసారిగా రావడంతో నీటి ఉద్ధృతికి వారందరూ కొట్టకుపోయినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. తాము చూస్తుండగానే, జిషాన్ తో పాటు మరో ముగ్గురు నీటిలో మునిగిపోయారని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల మృతదేహాలను భారత్ కు తరలించే ప్రయత్నాలు చేస్తున్నామని భారత విదేశాంగ శాఖ ప్రకటించింది. డెడ్ బాడీలను భారత్ తీసుకొచ్చేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా.. ఈ యాక్సిడెంట్ దురదృష్ట ఘటన అని పీటర్స్ బర్గ్ లోని భారత దౌత్యకార్యాలయం పేర్కొంది. బాధిత కుటుంబాలకు సాయం అందిస్తామని వెల్లడించింది.

# యురోపియన్ పార్లమెంట్ ఎన్నికలు ప్రారంభం

బ్రస్సెల్స్ : రాబోయే ఐదేళ్ళ కాలానికి యురోపియన్ పార్లమెంట్ కూర్పు ఎలా వుండాలో నిర్ణయించేందుకు యురోపియన్ యూనియన్ (ఇయు)లోని 27 సభ్య దేశాలు గురువారం నుండి ఆదివారం వరకు ఓటు వేయనున్నాయి. ఇయుకు రాజకీయ దిశా నిర్దేశం చేయగల, ఇయు చైనా విధానాన్ని రూపొందించగల ప్రభావం ఈ ఎన్నికల ఫలితాలకు వుంది. ఈ ఎన్నికలను దృష్టిలో వుంచుకునే, చైనా ఎలక్ట్రిక్ వెహికల్స్‌పై టారిఫ్‌లకు సంబంధించి నిర్ణయాన్ని ఈ నెల 10 వరకు ఇయు వాయిదా వేసింది. ఎన్నికల ప్రచార పరిధిలోకి ఈ అంశాన్ని తీసుకురాకూడదని భావించే ఈ చర్య తీసుకుంది. ప్రత్యక్షంగా ఎన్నికయ్యే ఏకైక ఇయు సంస్థ యురోపియన్ పార్లమెంట్, ఇది యురోపియన్ కమిషన్, కౌన్సిల్ వంటి ఇయు కార్యనిర్వాహక బ్రాంచ్‌లతో యురోపియన్ పౌరులను కలుపుతుంది. ఆదివారం సాయంత్రానికల్లా ఏ ఏ పార్టీలు పార్లమెంట్‌లో ఎన్ని సీట్లను గెలుచుకున్నాయో తెలిసిపోతుంది. ప్రతి దేశం యొక్క జనాభా నిష్పత్తికి తగిన రీతిలో యురోపియన్ పార్లమెంట్‌లో ఆ దేశానికి సభ్యులు వుంటారు. ప్రధానంగా రెండు అతిపెద్ద పార్టీలు మధ్యే మితవాద యురోపియన్ పీపుల్స్ పార్టీ (ఇపిపి), మధ్యే వామపక్ష ప్రగతిశీల కూటమి సోషలిస్ట్స్ అండ్ డెమోక్రాట్స్ (ఎస్ అండ్ డి) పార్లమెంట్‌లో వున్నాయి. ఇవి కాకుండా ఇంకా మరికొన్ని పార్టీలు కూడా వున్నాయి. ప్రధానంగా మితవాద, అతి మితవాద పార్టీలు లబ్ది పొందే అవకాశాలు వున్నాయని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. అయితే శరణార్థులు, జీవనోపాధులు, ఇంధన సంక్షోభం వంటి సమస్యలను పరిష్కరించడంలో ఈ పార్టీలు విఫలమయ్యాయని భావిస్తున్నారు. ఇక దేశీయ సమస్యలు, జాతీయ ప్రయోజనాలకు ప్రాధాన్యతనిచ్చే పార్టీలు నెమ్మదిగా ప్రాధాన్యత పొందుతున్నాయి. ప్రస్తుత యురోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాండెర్ లేయన్ కూడా తిరిగి పోటీ పడుతున్నారు. అమెరికా అనుకూల వైఖరితో వ్యవహరించే ఆమె తిరిగి ఎన్నికైతే చైనా-ఇయు సంబంధాలు దెబ్బతినవచ్చు. బడ్జెట్ ప్రణాళికలను ఆమోదించే హక్కు కూడా పార్లమెంట్‌కు వున్నందున, ఈ కూర్పులో మార్పు ఏం జరిగినా అది ఉక్రెయిన్‌కు ఇయు సాయాన్ని ప్రభావితం చేస్తుంది.

# బండి సంజయ్‌ని పట్టించుకోని కంగనా రనౌత్..


ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ సమావేశం ఢిల్లీలో జరిగిన విషయం తెలిసిందే. ఈ సమావేశంలో ఎన్డీయే పక్ష నేతగా నరేంద్ర మోదీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఢిల్లీలోని పాత పార్లమెంట్ భవనంలో ఎన్డీయే కూటమి సమావేశంలో కొత్తగా ఎన్నికైన ఎంపీలు, ఎన్డీయే కూటమి నేతలు మోదీని మూడోసారి ఎన్డీయే పక్ష నేతగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మోదీకి నేతలు శుభాకాంక్షలు తెలిపారు. అయితే ఈ పార్లమెంటరీ పార్టీ సమావేశానికి హాజరైన కరీంనగర్ బీజేపీ ఎంపీ బండి సంజయ్ సోషల్ మీడియాలో ప్రస్తుతం ట్రోల్ అవుతున్నాడు. ఈ సమావేశానికి ముందు మండీ ఎంపీ బాలీవుడ్ ఫైర్ బ్రాండ్ కంగనా రనౌత్, లోక్ జనశక్తి పార్టీ నేత చిరాగ్ పాశ్వాన్‌లు ఒకరికి ఒకరు కలిసి శుభాకాంక్షలు తెలుపుకుంటున్నారు. అయితే ఈ క్రమంలోనే అక్కడకు వచ్చిన బండి సంజయ్ శుభాకాంక్షలు తెలుపుదామని కంగనాకు ఫ్లవర్స్ బొకే ఇవ్వగా బండి ఎవరో తెలియని కంగనా తనవైపు చూసి పట్టించుకోకుండా వెళుతుంది. దీంతో బండిని బీజేపీ అధిష్టానమే కాకుండా కంగనా కూడా పట్టించుకోలే అంటూ నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. కాగా ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతుంది.

# సైలెంట్ హార్ట్ ఎటాక్ లక్షణాలు ఎలా ఉంటాయంటే..




అప్పటి వరకూ బాగానే ఉన్న ఓ వ్యక్తి సడెన్‌గా కుప్పకూలి ప్రాణాలు కోల్పోయే సంఘటనలు అక్కడక్కడా జరుగుతుండటం మనం చూస్తూనే ఉంటాం. ఇటీవల ప్రపంచ వ్యాప్తంగా ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయి. జిమ్‌లో వర్కవుట్స్ చేస్తూ కొందరు, డ్యాన్స్ చేస్తూ ఇంకొందరు, తమ తమ పనుల్లో నిమగ్నమై ఉండగా మరి కొందరు సైలెంట్‌గా హార్ట్ ఎటాక్ బారిన పడుతున్నారు. అసలీ సైలెంట్ గుండెపోటు ఎందుకు వస్తుంది?, నిపుణులు ఏం చెప్తున్నారో చూద్దాం. శరీరంలో ముందస్తుగా లక్షణాలు కనిపిస్తే అలర్ట్ కావచ్చు. కానీ సైలెంట్ హార్ట్ ఎటాక్ అలా కాదు. వారాలు లేదా నెలల తరబడిగా గుండె దెబ్బతింటూ వస్తుంది కానీ ఈ విషయం బాధితులకు ఏమాత్రం తెలియదు. ఎందుకంటే ఆ తాలూకూ సింప్టమ్స్ వారిలో కనిపించవు. కుప్పకూలే వరకు తాము బాగానే ఉన్నామని అనుకుంటారు. అమెరికన్ హార్ట్ అసోసియేషన్ ఇటీవల రిపోర్ట్ ప్రకారం ప్రపంచవ్యాప్తంగా నమోదు చేయబడిన 8,05,000 గుండెపోటు కేసుల్లో 1,70,000 సైలెంట్ హార్ట్ ఎటాక్‌కు సంబంధించినవే ఉంటున్నాయి. నిశ్శబ్ద గుండెపోటు వచ్చిన వ్యక్తుల్లో లక్షణాలు పైకి కనిపించవు. అరుదుగా కొందరిలో గుండెల్లో మంట, జ్వరం లేదా ఛాతీ కండరాలు బిగుతుగా అనిపించడం వంటివి రెండు మూడు రోజులుగా కనిపించవ్చు. అలాంటప్పుడు టెస్టులు చేయించుకోవడం బెటర్. ఎందుకంటే కొన్నిసార్లు గుండెకు వెళ్లే రక్త ప్రవాహానికి ఆటంకం కలగడంవల్ల కూడా ఇలా జరిగే అవకాశం ఉంది. సైలెంట్ హార్ట్ ఎటాక్ కూడా గుండె కండరాలకు నష్టం కలిగిస్తుంది. అలాగని సైలెంట్ హార్ట్ ఎటాక్ వల్ల కచ్చితంగా ఛాతీ నొప్పి లేదా శ్వాస ఆడకపోవడం వంటి లక్షణాలు కనిపించకపోవచ్చు. మరికొన్ని సార్లు సైలెంట్ హార్ట్ ఎటాక్‌కు ముందు బాధిత వ్యక్తి శరీరమంతా ప్రభావితం అవుతుంది. రెండు లేదా ఒక చేతిలో, అలాగే మెడ, దవడ, పొత్తికడుపు భాగంలో అసౌకర్యంగా అనిస్తుందని ఆరోగ్య నిపుణులు చెప్తున్నారు. అయితే అందరిలో ఇలాంటి లక్షణాలే ఉండకపోవచ్చు కూడా. వ్యక్తికీ వ్యక్తికీ మారుతుంటాయి. దీంతోపాటు సాధారణం కంటే ఎక్కువగా చెమటలు పట్టడం, వ్యాయామాలు చేయకపోయినా చెమటలు పడుతూ అలసి పోవడం సైలెంట్ హార్ట్ ఎటాక్ వచ్చే ముందు జరగవచ్చు. ఎందుకంటే మూసుకుపోయిన ధమనుల ద్వారా రక్తాన్ని పంప్ చేయడానికి గుండె ఎక్కువ శ్రమ పడటంవల్ల ఇలా జరుగుతుంది.

# లివర్‌ని శుభ్రపరిచేందుకు ఈ డ్రింక్స్ తాగండి..



మానవుల జీర్ణవ్యవస్థలో కాలేయం అతిపెద్దది పాత్ర పోషిస్తుంది. అతి ముఖ్యమైన అవయవాలలో కాలేయం ఒకటి. ఇది వివిధ పదార్థాల జీవక్రియతో సహా శరీరంలో వివిధ ముఖ్యమైన పాత్రలను పోషిస్తుంది. వ్యాధిగ్రస్తులైన లేదా అనారోగ్యకరమైన కాలేయం శరీరంలోని అన్ని జీవ వ్యవస్థలను ప్రభావితం చేస్తుంది. అందువల్ల, కాలేయం దాని ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి శుభ్రపరచడం చాలా ముఖ్యం. కాలేయం శుభ్రపడాలంటే ఇలా చేయండి. బాడీలో పొట్టభాగంలో ఎడమవైపు నొప్పిగా ఉంటే అది లివర్ సమస్య కావొచ్చు. లివర్ ప్రాబ్లమ్స్ ఉంటే కడుపు నొప్పిగా ఉంటుంది. లివర్ డీటాక్స్ అయ్యేందుకు కొన్ని డ్రింక్స్ హెల్ప్ చేస్తాయి. వీటిని తాగడం వల్ల లివర్ డీటాక్స్ అవుతాయి. ఉదయాన్నే ఖాళీ కడుపుతో ఓ గ్లాసు వేడినీటిలో నిమ్మరసం కలిపి తాగండి. ఇందులోని విటమిన్ సి లివర్ డీటాక్స్ ఎంజైమ్స్‌ని ప్రేరేపించి పిత్త ఉత్పత్తికి సాయపడుతుంది. పిత్తం కాలేయంలోని కొవ్వుని విచ్ఛిన్నం చేయడానికి హెల్ప్ చేస్తుంది. బీట్‌రూట్‌లో ఎక్కువగా బీటాలైన్స్ ఉన్నాయి. ఇవి కాలేయ పనితీరుకి మద్దతిచ్చే యాంటీ ఆక్సిడెంట్. ఈ పాలని తాగితే లివర్ డీటాక్స్ అవుతుంది. అందుకే, తాజా బీట్‌రూట్ జ్యూస్ తాగితే లివర్ హెల్దీగా ఉంటుంది. పసుపులో కర్కుమిన్ యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ ఆక్సిడెంట్ గుణాలు ఉంటాయి. పాలలో పసుపు వేసుకుంటే అవి మంచి డీటాక్సీఫైయర్ డ్రింక్‌లా పనిచేస్తాయి. అందుకోసం పాలలో కొద్దిగా పసుపు, నల్ల మిరియాల పొడి వేయండి. ఈ పాలని తీసుకుంటే అవి లివర్ హెల్త్‌ని కాపాడుతుంది. గ్రీన్ టీలో కాటెచిన్స్ ఉంటాయి. ఇవి ఓ శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్. ఇది లివర్ దెబ్బతినకుండా, డీటాక్స్ అవ్వడానికి హెల్ప్ చేస్తుంది. అందుకోసం రోజూ ఒకటి, రెండు కప్పుల గ్రీన్ టీ తాగితే లివర్ హెల్త్‌కి మంచిది. డాండెలైన్ రూట్ టీని వేడినీటిలో మరిగించి రెగ్యులర్‌గా తీసుకుంటే మీరు లివర్‌ని కాపాడుకోవచ్చు. ఈ టీలో కూడా లివర్ డిటాక్సీఫైయింగ్ గుణాలు ఉన్నాయి. ఇవి పిత్త ఉత్పత్తిని ప్రేరేపించి లివర్ పనితీరుకి సాయపడుతుంది.

# వేసవిలో హీట్ స్ట్రోక్ వచ్చే ప్రమాదం ఎవరికి ఎక్కువగా ఉంటుందంటే..?




వేసవి కాలంలో తరచుగా హీట్ స్ట్రోక్ వచ్చే ప్రమాదం ఉంది. వేడిగాలి, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు అనారోగ్యానికి గురి చేస్తాయి. ఈ సీజన్‌లో హీట్‌స్ట్రోక్ నుండి సురక్షితంగా ఉండటానికి అనేక చర్యలు తీసుకుంటుంటారు. ప్రతి ఒక్కరూ ఏదో ఒక సమయంలో ఇది ఎదుర్కోవలసి ఉంటుంది. వేసవిలో వడదెబ్బ తగలకుండా ఉండాలంటే కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యనిపుణులు సూచిస్తున్నారు. వేసవిలో హీట్ స్ట్రోక్ నుండి మిమ్మల్ని మీరు రక్షించుకోవడం చాలా ముఖ్యం. ముఖ్యంగా రోగనిరోధక శక్తి బలహీనంగా ఉన్న వ్యక్తులు, రోజు వేడి గాలిలో ఎక్కువసేపు బయట ఉండే వారు ఎక్కువగా జాగ్రత్తలు తీసుకోవాలి. అలాగే ఈ హీట్ స్ట్రోక్‌కు గురయ్యే ప్రమాదం ఎక్కువగా ఉన్న మరికొంతమంది వ్యక్తుల గురించి తెలుసుకుందాం. 1. వృద్ధులు, చిన్నపిల్లలు.. వృద్ధులు, చిన్నపిల్లలు వేసవిలో వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. వాస్తవానికి ఈ వ్యక్తుల రోగనిరోధక శక్తి ఇతర వ్యక్తుల కంటే చాలా బలహీనంగా ఉంటుంది. అంతే కాదు వేడిని తట్టుకోగల సామర్థ్యం కూడా చాలా తక్కువగా ఉంటుంది. దీని కారణంగా వారు వేసవి కాలంలో త్వరగా అనారోగ్యానికి గురవుతారు. 2.గర్భిణీ స్త్రీలు... గర్భిణీ స్త్రీలు కూడా హీట్ స్ట్రోక్ ప్రమాదంలో పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఈ సీజన్‌లో కడుపులో పెరిగే బిడ్డకు ప్రమాదం మరింత పెరుగుతుంది. హీట్ స్ట్రోక్ వల్ల నెలలు నిండకుండానే పుట్టడం, బరువు తగ్గడం వంటి సమస్యలు తలెత్తుతాయి. 3. ఎండలో ఎక్కువ సేపు ఉండేవారు.. ఫీల్డ్ వర్కర్లు లేదా రైతులు లేదా ఎక్కువసేపు ఎండలో ఉండే వారికి కూడా హీట్ స్ట్రోక్ వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఎక్కువసేపు ఎండలో ఉండడం వల్ల హీట్ స్ట్రోక్, వాంతులు వంటి సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. 4. ఇప్పటికే ఏదైనా వ్యాధితో బాధపడుతున్న వ్యక్తులకు వేసవిలో సమస్యలు పెరుగుతాయి. గుండె సంబంధిత వ్యాధులు, మధుమేహం లేదా ఊపిరితిత్తుల సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వ్యక్తులు ఈ సీజన్‌లో ప్రత్యేక శ్రద్ధ వహించాలి.

# నెల ఉల్లిపాయ తినకపోతే ఎలాంటి మార్పులు వస్తాయో తెల్సా..?




ఉల్లి చేసే మేలు తల్లి కూడా చేయదనేది మన తెలుగులో ఎప్పట్నుంచో వింటున్న సామెత. ఉల్లిపాయ అనేది ప్రపంచవ్యాప్తంగా వంటల్లో సాధారణంగా ఉపయోగించే ఒక కూరగాయ. బర్గర్‌ల నుండి ఫ్రైస్ వరకు ప్రతిదానికీ రుచి కావాలంటే ఉల్లి ఉండాల్సిందే. ఇక బయట బజ్జీలు, గారెలు ఏం తిన్నా.. పక్క టచ్చింగ్ కోసం పచ్చి ఉల్లి ఉండాల్సిందే. అయితే కొందరికి దీని రుచి నచ్చకపోవచ్చు. పచ్చి ఉల్లిని తిన్నాక నోటి దుర్వాసన రావడానికి కూడా ఇందుకు కారణం కావొచ్చు. మీరు 1 నెల ఉల్లిపాయలు తినకపోతే ఏమి జరుగుతుందో ఇప్పుడు తెలుసుకుందాం పదండి. ఉల్లిపాయలు కేవలం రుచి కోసం మాత్రమే కాదు. అవి అవసరమైన విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లతో నిండి ఉంటాయి. మీ శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో ఇవన్నీ ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. ఉల్లిపాయల నుంచి విటమిన్ సి, బి6, ఫోలేట్ లభిస్తాయి. బలమైన రోగనిరోధక వ్యవస్థ, కణాల పెరుగుదల, ఆరోగ్యకరమైన జీవక్రియ కోసం ఇవి అవసరం. ఉల్లిపాయలు అల్లైల్ ప్రొపైల్ డైసల్ఫైడ్ వంటి శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లతో నిండి ఉన్నాయి. ఇందులో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ క్యాన్సర్ లక్షణాలు ఉన్నాయి. ఉల్లిపాయలు డైటరీ ఫైబర్‌కు మంచి సోర్స్ అని చెప్పాలి. ఆరోగ్యకరమైన జీర్ణవ్యవస్థకు ఫైబర్ అవసరం. వాటిని తినడం ఆపేస్తే మలబద్ధకం లేదా ఇతర జీర్ణ సమస్యలకు దారి తీయొచ్చు. ఉల్లిపాయల్లో అల్లిసిన్, క్వెర్సెటిన్ ఉంటాయి. యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీఆక్సిడెంట్ లక్షణాలను ఉల్లి కలిగి ఉంది. ఇన్ని గుణాలున్న ఉల్లిని మీరు తీసుకోవడం మానేస్తే.. కాలక్రమేణా దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని పెంచుతుంది. ఉల్లిపాయలు అవసరమైన పోషకాలతో నిండి ఉన్నాయి. మీ ఆహారం నుండి వాటిని తొలగించడం వలన ఆ పోషకాల లోపాలకు దారి తీస్తుంది. ఉల్లిపాయలను దూరంగా పెట్టడం వల్ల మాంగనీస్, పొటాషియం వంటి ఖనిజాలతో పాటు విటమిన్లు సి, బి6, ఫోలేట్ వంటివి శరీనానికి అందవు. దీంతో రోగనిరోధక వ్యవస్థ బలహీనమవుతుంది. అలసట, రక్తం గడ్డకట్టడం, ఎర్ర రక్త కణాల డ్యామేజ్ అవ్వడం వంటి సమస్యలు వస్తాయి.

# అలసటతో బాధపడుతున్నారా..?



అనేక రకాల పోషకాలు, విటమిన్లు మన శరీరానికి అవసరం.. వాటిలో ఒకటి విటమిన్ డి.. విటమిన్ డి లోపం ఎముకలను బలహీన పరుస్తుంది.. ఇంకా కండరాలు నొప్పి, బలహీనత వంటి సమస్యలను కూడా కలిగిస్తుంది.ఇంకా అలసట.. నీరసం లాంటి సమస్యలు కూడా మొదలవుతాయి.. ఏ పని చేయాలన్నా.. ఆసక్తి ఏర్పడదు.. అందుకే.. ఇలాంటి లక్షణాలు ఏమన్నా కనిపిస్తే.. వెంటనే వైద్యులను సంప్రదించి విటమిన్ డి స్థాయిని తనిఖీ చేసుకోవాలి.. ఈ లోపాన్ని అధిగమించడానికి చాలా రోజులు పడుతుందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి..ఒకవేళ.. విటమిన్ డి లోపం ఉన్నట్లు నిర్ధారణ అయినట్లయితే.. ఈ లోపాన్ని అధిగమించడానికి, శరీరాన్ని మళ్లీ ఆరోగ్యంగా మార్చడానికి ఎంత సమయం పడుతుంది అనే విషయాలపై తప్పనిసరిగా అవగాహన ఉండాలి..అయితే.. విటమిన్ డి లోపాన్ని అధిగమించడానికి పట్టే సమయం అనేక అంశాలపై ఆధారపడి ఉంటుంది.. అవేంటో తెలుసుకోండి..విటమిన్ డీ లోపం తీవ్రత : విటమిన్ డి లోపం ఎంత తీవ్రంగా ఉంటే, దాన్ని అధిగమించడానికి, చికిత్స పూర్తవ్వడానికి ఎక్కువ సమయం పడుతుంది.చికిత్స రకం : విటమిన్ డి లోపాన్ని అధిగమించడానికి, వైద్యులు సాధారణంగా విటమిన్ డి సప్లిమెంట్లను తీసుకోవాలని సిఫార్సు చేస్తారు. సప్లిమెంట్స్ తీసుకునే మొత్తం.. వ్యవధి లోపం, తీవ్రతను బట్టి నిర్ణయిస్తారు. ఆరోగ్యం కూడా ముఖ్యమే : మీ మొత్తం ఆరోగ్యం బాగుంటే.. మీకు ఎలాంటి తీవ్రమైన వ్యాధులు లేకుంటే, విటమిన్ డి స్థాయిలు వేగంగా పెరుగుతాయి. విటమిన్ డిని గ్రహించే సామర్థ్యం: కొంతమందికి విటమిన్ డిని గ్రహించే సామర్థ్యం తక్కువగా ఉంటుంది. దీని కారణంగా విటమిన్ డి స్థాయిని పెంచడానికి ఎక్కువ సమయం పట్టవచ్చు.

# పిల్లలు పుట్టడానికి కూడా ఏజ్ లిమిట్ ఉంటుందా?



మాతృత్వపు అనుభూతిని పొందడం ప్రతి ఒక్కరి జీవితంలో గొప్ప వరం. ఒకప్పుడు చాలా చిన్న ఏజ్‌లోనే పెళ్లిలు జరిగేవి, బిడ్డకు జన్మను కూడా ఇచ్చేవారు. కానీ ఇప్పుడు అంతా మారిపోయింది. మూడు పదుల్లో పెళ్లి చేసుకోవడం, పెళ్లైన మూడు లేదా నాలుగు సంవత్సరాల వరకు పిల్లల గురించి ప్లాన్ చేసుకోకపోవడం అనేది నయా ట్రెండ్ అయిపోయింది. అంతే కాకుండా ప్రస్తుతం సంతానలేమి సమస్యలు కూడా అధికం అవుతున్నాయి. దీని కారణం వయసు అని కూడా కొందరు అంటున్నారు. అయితే పిల్లలు పుట్టడానికి కూడా ఓ ఏజ్ లిమిట్ అనేది ఉంటుందా? దీని గురించి నిపుణులు ఏమంటున్నారో ఇప్పుడు తెలుసుకుందాం. పెళ్లి జరిగింది. అందరూ ఇక ఓ కొడుకును కని ఇవ్వండి అని సరదాగా అయినా తమ మనసులో మాట బయటపెడుతుంటారు. కానీ ఆ జంట మాత్రం ఫైనాన్షియల్‌గా సెటిల్ అయ్యాకే పిల్లల గురించి ఆలోచిస్తాం అనే ధోరణిలో ఉంటుంది. అదే విషయాన్ని తమ పేరెంట్స్‌కు కూడా చెబుతున్నారు. కానీ, వారు వినరు ఏజ్ పెరిగితే పిల్లలు పుట్టరు, మాకు అయితే వారసుడిని ఇవ్వండి అని వాదిస్తున్నారు. మరి నిజంగానే ఏజ్ దాటితే పిల్లలు పుట్టరా అంటే? అలాంటిది ఏమీ లేదు అంటున్నారు నిపుణులు.

# ఈ మొక్క ఎక్కడ దొరికినా ఇంటికి ఖచ్చితంగా తెచ్చుకోండి..



ఆయుర్వేదంలో అనేక మొక్కల్ని అనేక వ్యాధులు నయం చేయడానికి ఉపయోగిస్తూ ఉంటారు. ఆయుర్వేదంలో ఎన్నో రకాల మొక్కల్ని.. పలు అనారోగ్య, దీర్ఘకాలిక సమస్యల్ని తగ్గించడానికి ఉపయోగిస్తారు. ఈ మొక్కలు ఒక రకంగా చెప్పాలంటే వరం లాంటివి. వీటిల్లోకి జిల్లేడు మొక్క కూడా చేరుతుంది. సాధారణంగా ఈ మొక్కల్ని పూజలు చేయడానికి మాత్రమే ఉపయోగిస్తూ ఉంటారు. కానీ ఈ మొక్కను ఆయుర్వేదంలో ఎన్నో రకాల అనారోగ్య సమస్యల్ని తగ్గించడానికి వాడుతూ ఉంటారు. కీళ్ల నొప్పులు, దంత సమస్యలు, విరేచనాలు, మలబద్ధకం వంటి వాటి నుండి రక్షిస్తుంది. ఇందులో యాంటీ ఇన్ ఫ్లమేటరీ గుణాలు, యాంటీ ఆక్సిడెంట్ల లక్షణాలు ఉన్నాయి. గాయాల్ని త్వరగా నయం చేయడానికి కూడా ఈ మొక్క యూజ్ అవుతుంది. ఈ మొక్కతో ఇంకా ఎలాంటి ప్రయోజనాలు ఉన్నాయో ఇప్పుడు చూద్దాం. తలనొప్పి: తలనొప్పిని తగ్గించడంలో జిల్లేడు మొక్క అద్భుతంగా పని చేస్తుంది. తలనొప్పిగా ఉన్నప్పుడు. జిల్లేడు ఆకుల్ని మొత్తగా గ్రైండ్ చేసి.. దీని పేస్ట్‌ని నుదిటిపై రాయండి. వీటిల్లో యాంటీ ఇన్ ఫ్లమేటరీ, యాంటీ సెప్టిక్ లక్షణాలు ఉండటం వల్ల తలనొప్పి, వాపు, ఎరుపు, చికాకు తగ్గుతాయి. చర్మ ఇన్ ఫెక్షన్లు తగ్గుతాయి: చర్మంపై దురదలు రావడం, తామర వంటి సమస్యలను తగ్గించడంలో కూడా జిల్లేడు ఆకు బాగా పని చేస్తుంది. జిల్లేడు ఆకుల పేస్టును మీకు దురద, తామర వచ్చిన ప్రదేశంలో రాసుకోండి. అంతే కాకుండా అనేక రకాల చర్మ ఇన్ఫెక్షన్లు పెరగకుండా సహాయ పడుతుంది. పైల్స్ తగ్గుతాయి: పైల్స్ సమస్యకి కూడా జిల్లేడు చెట్టు ఆకులు అద్భుతంగా పని చేస్తాయి. జిల్లేడు చెట్టు ఆకుల్ని పేస్టుల చేసి.. పైల్స్ గాయంపై తరచూ పెట్టాలి. ఇలా చేయడం వల్ల గాయం త్వరగా తగ్గుతుంది. నొప్పి నుంచి కూడా ఉపశమనం లభిస్తుంది. కీళ్ల నొప్పులు తగ్గుతాయి: చాలా మందిలో కీళ్ల నొప్పులు అనేవి సాధారణంగా ఉండే సమస్య. కీళ్ల నొప్పులు అంత త్వరగా తగ్గవు. అందులోనూ పెద్దవారిలో ఇవి ఎక్కువగా వస్తూ ఉంటాయి. ఇలాంటి వారు ఎక్కువ ఖర్చు పెట్టి మందులు కొనడం కంటే.. జిల్లేడు ఆకుల నుంచి తీసిన రసాన్ని తరచూ పూస్తూ ఉంటే త్వరగా ఉపశమనం ఉంటుంది.




# ప్రభాస్ 'కల్కి' సినిమా ట్రైలర్ వచ్చేసింది





సినీ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న 'కల్కి 2898 ఏడీ' ట్రైలర్ వచ్చేసింది. ఈ సినిమాలో బౌంటీ హంటర్‌గా ప్రభాస్ చేసిన సాహసాలను ఈ ట్రైలర్‌లో చూపించారు. యాక్షన్ సన్నివేశాలు అద్భుతంగా ఉన్నాయి. ట్రైలర్‌లో ప్రభాస్ కనిపించిన తీరు సంచలనం రేపుతోంది. ఇక అశ్వథామ పాత్రలో అమితాబ్ బచ్చన్, కీలక పాత్రలో దీపిక కనిపిస్తూ.. ఇక 'భయపడుకు మరో ప్రపంచం వస్తోంది' అంటూ చివర్లో కమల్ హాసన్ చెప్పే డైలాగ్ ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ సినిమాలో ప్రభాస్ వాహనం బుజ్జి టీజర్ ఇప్పటికే విడుదలై.. పిల్లల నుంచి పెద్దల వరకు అందరినీ అలరించింది. నాగ్ అశ్విన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం సైన్స్ ఫిక్షన్, ఫ్యూచరిస్టిక్ ఫిల్మ్‌గా తెరకెక్కుతుండగా.. ఈ సినిమాలో ప్రభాస్‌తో పాటు అమితాబ్ బచ్చన్, కమల హాసన్, దీపికా పదుకొనే, దిశా పటాని కీలక పాత్రలు పోషించారు. ఇక అశ్వినీదత్ నిర్మిస్తున్న ఈ సినిమా ఈ నెల 27న విడుదల కానుంది.

# బాలీవుడ్ నటి ఆత్మహత్య...

బాలీవుడ్ నటి నూర్ మలాబికా దాస్ అనుమానాస్పద రీతిలో మృతి చెందింది. ముంబైలోని ఆమె అపార్ట్‌మెంట్ నుంచి దుర్వాసన రావడంతో ఇరుగుపొరుగు వారు పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులకు కుళ్లిపోయిన స్థితిలో నూర్ మృతదేహం కనిపించింది. మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఆమె ఆత్మహత్య చేసుకుందని పోలీసులు భావిస్తున్నారు. ఆమె మరణానికి రెండు వారాల ముందు, కుటుంబ సభ్యులు ముంబైలోని నటి నివాసానికి వెళ్లారు. కాగా, ఆమె చనిపోయిన తర్వాత మృతదేహాన్ని చూసేందుకు కుటుంబ సభ్యులు రాకపోవడం గమనార్హం. మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు పోలీసులు ఫోన్ చేసినా పట్టించుకోలేదు. దీంతో ఓ ఎన్జీవో సహాయంతో ఆమె అంత్యక్రియలు పూర్తయ్యాయి.



# సల్మాన్ ఖాన్ సికిందర్ ఫస్ట్ షెడ్యూల్ వచ్చేసింది.. షూట్ ఎక్కడంటే..?




బాలీవుడ్ స్టార్ యాక్టర్ సల్మాన్ ఖాన్ టైటిల్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం 'సికందర్'. కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ ఏఆర్ మురుగదాస్ నడియాడ్వాలా గ్రాండ్‌సన్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై సాజిద్ నదియాడ్వాలా తెరకెక్కిస్తున్నారు. సికిందర్‌ను 2025 ఈద్ కానుకగా విడుదల చేయనున్నట్టు ఇప్పటికే ప్రకటించి అభిమానులు, మూవీ లవర్స్‌లో జోష్ నింపారు. తాజాగా ఈ సినిమా షూటింగ్‌కు సంబంధించిన క్రేజీ వార్త ఒకటి బయటకు వచ్చింది. తాజా సమాచారం ప్రకారం జూన్ 18 నుంచి ఫస్ట్ షూటింగ్ షెడ్యూల్ షురూ కానుంది. ముంబైలో మొదలు కాబోతున్న ఈ షెడ్యూల్‌లో ఎయిర్ యాక్షన్ సీక్వెన్స్‌ను చిత్రీకరించనున్నారు. సికిందర్ టీం నుంచి ఎక్జయిటింగ్ అప్‌డేట్ రావడంతో ఆనందంలో ఎగిరిగంతేస్తున్నారు అభిమానులు. సికిందర్‌లో సల్మాన్‌ఖాన్‌తో కన్నడ సోయగం రష్మికమందన్నా రొమాన్స్ చేయనుందని తెలిసిందే. ఈ మూవీలో బాహుబలి ఫ్రాంఛైజీలో కట్టప్పగా వరల్డ్ వైడ్‌గా పాపులారిటీ సంపాదించిన సత్యరాజ్ విలన్‌గా కనిపించబోతున్నాడు. నేను రజినీకాంత్ స్నేహితుడిని.. సల్మాన్‌ఖాన్‌తో పోటీ పడబోతున్నానని చెప్పి సికిందర్‌పై అంచనాలు అమాంతం పెంచేస్తున్నుడు సత్యరాజ్. పుష్ప సినిమాతో వరల్డ్‌వైడ్‌గా సూపర్ క్రేజ్ సంపాదించుకున్న నేషనల్ క్రష్ రష్మికమందన్నాను సికిందర్‌తోపాటు పుష్ప ది రూల్‌లో కూడా కనిపించబోతుందని తెలిసిందే.

# న్యూ మూవీ.. బాలకృష్ణకు బోయపాటి బర్త్ డే గిఫ్ట్..





నట సింహం నందమూరి బాలకృష్ణ బర్త్ డే సందర్భంగా కొత్తి సినిమాని ఎనౌన్స్ చేశారు మేకర్స్. హ్యాట్రిక్ హిట్ కాంబినేషన్ అయిన బోయపాటి - బాలకృష్ణ కాంబినేషన్‌లో మరో సినిమా రానుంది. ఈ సందర్భంగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో ఆయన హీరోగా నటించబోయే కొత్త సినిమాను అధికారికంగా వెల్లడించారు. ఈ సినిమాని 14 రీల్స్ ప్లస్ సంస్థ నిర్మిస్తోంది. రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మాతలు. 'లెజెండ్' చిత్ర నిర్మాణంలోనూ వారు భాగస్వాములు. కాగా, హీరోగా బాలకృష్ణ 110వ చిత్రమిది. బోయపాటి శ్రీను దర్శకత్వంలో మూడో సినిమా అయితే... నిర్మాతలతో రెండోది! ఆగస్టు తర్వాత ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుందని సమాచారం.

# ఐటీ ఉద్యోగులకు విప్రో గుడ్ న్యూస్..





వరల్డ్ ఐటీ సెక్టార్ ఆర్థిక అనిశ్చితి లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. దీంతో చాలా కంపెనీలు లే ఆఫ్స్ కూడా ప్రకటించాయి. ప్రపంచ టెక్ దిగ్గజం గూగుల్ కూడా దీనికి అతీతం కాదు అన్నట్లుగా మారింది. ప్రతీ ఏటా వందల సంఖ్యలో ఉద్యోగులను తొలగిస్తూనే ఉంది. దీంతో వారు రోడ్డున పడి ఇబ్బందులు పడుతున్నారు. ఇక ఉద్యోగంలో ఉన్న వారు కూడా ఎంత మాత్రం ఆనందంగా లేరు. ఎందుకంటే వారి ఉద్యోగాలు కూడా ఎప్పుడు పోతాయా? అటూ భయపడుతూనే ఉద్యోగం చేస్తున్నారు. ఐటీ కంపెనీలు ఇంత సంక్షోభాన్ని ఎదుర్కొంటుంటే విప్రో మాత్రం తమ సంస్థ ఉద్యోగులకు గుడ్ న్యూస్ చెప్పింది. వేల కోట్ల విలువైన భారీ ప్రాజెక్ట్ ను దక్కించుకున్నట్లు ఉద్యోగులకు మంచి వార్త చెప్పింది. ఉద్యోగాలు ఉంటాయో ఊడుతాయో తెలియని ఆందోళనలో ఉన్న సమయంలో ఈ న్యూస్ నోట్లో చెక్కర పోసినంత తీయగా అనిపించింది. ప్రపంచ వ్యాప్తంగా ఐటీ సెక్టార్ కుదేలవుతుంటే.. ఇండియన్ ఐటీ కంపెనీ అయిన విప్రో మాత్రం భారీ కాంట్రాక్టులను దక్కించుకొంటూ ఆశ్చర్యానికి గురి చేస్తోంది. ప్రముఖ అమెరికా కమ్యూనికేషన్ సర్వీస్ ప్రొవైడర్ నుంచి భారీ కాంట్రాక్ట్ పొందినట్లు కంపెనీ తెలిపింది. ఐదేళ్ల కాలానికి సుమారు 4,175 కోట్ల రూపాయల డీల్ ను దక్కించుకున్నట్లు కంపెనీ ఎక్స్ ఛేంజీలకు సమర్పించిన ఫైలింగ్ లో తెలిపింది. ఈ డీల్ లో భాగంగా కంపెనీ ఉత్పత్తులు, పరిశ్రమకు సంబంధించిన పరిష్కారాల కోసం అమెరికన్ సంస్థకు నిర్వహణ సేవలను అందించనున్నట్లు విప్రో తెలిపింది. 2024 ఆర్థిక సంవత్సరంలో విప్రో కమ్యూనికేషన్ విభాగం వార్షిక ప్రాతిపదికన 14.7 శాతం క్షీణించింది. మొత్తం ఆదాయంలో విప్రో కమ్యూనికేషన్ విభాగం నుంచి కంపెనీకి 4.2 శాతం ఆదాయం సమకూరింది. అగ్రశ్రేణి ఐటీ సంస్థలకు 500 మిలియన్ డాలర్ల నుంచి బిలియన్ డాలర్ల విలువైన ఒప్పందాలు కీలకం. ఎందుకంటే ఈ ఒప్పందాలే ఆదాయ వృద్ధిని ప్రభావితం చేస్తాయి. నాలుగో త్రైమాసికంలో విప్రో డీల్ బుకింగ్స్ 9.5 శాతం పెరిగి 1.2 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయని.. వృద్ధిని వేగవంతం చేయడమే తక్షణ కర్తవ్యం అని కొత్త సీఈఓ శ్రీనివాస్ పలియా ఎర్నింగ్స్ కాల్ లో పేర్కొన్నారు. ఐటీ పరిశ్రమ ప్రపంచ వ్యాప్తంగా లబోదిబోమంటుంటే.. ఇండియన్ ఐటీ దిగ్గజ కంపెనీ విప్రో మాత్రం భారీ కాంట్రాక్ట్ ను దక్కించుకొని ఫుల్ జోష్ లో ఉంది.

# వడ్డీ రేట్లపై ఆర్బీఐ కీలక నిర్ణయం..




భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) శుక్రవారం (జూన్ 06) కీలక ప్రకటన వెలువరించింది. కీలక వడ్డీ రేట్లను మరోసారి యథాతథంగా ఉంచుతున్నట్లు ప్రకటించింది. రెపో రేటు 6.50 వద్దే స్థిరంగా ఉంచింది. ఆర్బీఐ ఈ నిర్ణయం తీసుకోవడం ఇది వరుసగా 8వ సారి. బుధవారం (జూన్ 5) ప్రారంభమైన ద్వైమాసిక ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాలను ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ శుక్రవారం ప్రకటించారు. ఇంధన ధరల్లో ద్రవ్యోల్బణం నమోదవుతున్నట్లు పేర్కొన్నారు. అయినా ధరల పెరుగుదలపై ఎంపీసీ అప్రమత్తంగానే ఉందని వెల్లడించారు. వృద్ధి, ద్రవ్యోల్బణం మధ్య సమతుల్యత అనుకూలంగానే ఉందన్నారు. అయితే, ఆహార ద్రవ్యోల్బణం మాత్రం కొంత ఆందోళన కలిగిస్తుందన్నారు గవర్నర్. దీన్ని నిశితంగా పరిశీలించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. ద్రవ్యోల్బణాన్ని 4 శాతంలోపలికి తీసుకొచ్చే లక్ష్యానికి ఆర్బీఐ కట్టుబడి ఉందని శక్తికాంత దాస్ వెల్లడించారు. నైరుతి రుతు పవనాల కారణంగా ఖరీఫ్ సాగు పెరిగి ఉత్పత్తి పెరుగుతుందన్న ఆయన రుతుపవనాలతో రిజర్వాయర్లలో నీటి మట్టాలు పెరుగి రబీకి కూడా ఉత్పత్తి పెరగవచ్చన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను వృద్ధి రేటు అంచనా 7.5 శాతంగా ఆర్బీఐ అంచనా వేసింది. ఇది కార్యరూపం దాలిస్తే వరుసగా నాలుగో సంవత్సరం 7 శాతం పైనే వృద్ధి నమోదైనట్లు అని చెప్పారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రిటైల్ ద్రవ్యోల్బణం పూర్తి ఆర్థిక సంవత్సరానికి 4.5 శాతంగా అంచనా వేయగా.. వరుస త్రైమాసికాల్లో 4.9 శాతం, 3.8 శాతం, 4.6 శాతం, 4.5 శాతంగా అంచనా వేసింది. ఇతర కరెన్సీలతో పోలిస్తే రూపాయిని స్థిరత్వం దేశ దృఢమైన ఆర్థిక పునాదులకు నిదర్శనం అని శక్తికాంత దాస్ చెప్పారు. దీంతో 2023-24 వార్షిక ఫలితాలను చూస్తుంటే బ్యాంకింగ్ రంగం ఎంత బలోపేతంగా ఉందో తెలుస్తుందన్నారు. కస్టమర్ల భద్రతకే తొలి ప్రాధాన్యం ఉంటుందని చెప్పారు గవర్నర్. వినియోగదారులకు తెలియకుండా చాలా సంస్థలు కొన్ని రకాలు రుసుములు వసూలు చేస్తున్నట్లు ఆందోళన తెలిపారు. ఎఫ్‌డీఐలు బలంగా కొనసాగుతున్నాయని.. నికర ప్రాతిపదికన చూస్తే మాత్రం కొంత తగ్గుదల నమోదైందని చెప్పారు. అసురక్షిత లోన్ల జారీని అదుపులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

# క్రెడిట్ కార్డు బకాయి తీర్చలేకపోతున్నారా?




మార్కెట్లో డిజిటల్ మనీ వినియోగం పెంచేందుకు బ్యాంకులు క్రెడిట్ కార్డులను తీసుకువచ్చాయి. వీటితో ఎక్కువ మొత్తంలో డిజిటల్ మనీ లావాదేవీలు జరుగుతాయి. ఏదైనా వస్తువు కొనాలన్నా, హెూటల్, రెస్టారెంట్లలో ఖర్చు పెట్టిన డబ్బులు కట్టాలన్నా ఆందోళన చెందకుడా క్రెడిట్ కార్డులతో కట్టేయవచ్చు. ఒకప్పుడు క్రెడిట్ కార్డు కావాలంటే ఎంతో ప్రాసెస్ ఉండేది. కానీ అది నేడు చాలా సులభతరం అయ్యింది. కాలర్స్ ఫోన్ చేసి మరీ కార్డులను ప్రొవైడ్ చేస్తున్నారు. కేవలం ఒక్క ఫోన్ కాల్ తో వారికి కావాల్సిన వివరాలు తీసుకొని కార్డులను ఇంటికి పంపిస్తున్నారు. మధ్య తరగతి వ్యక్తి వద్ద కూడా పదుల సంఖ్యలో క్రెడిట్ కార్డులు ఉంటున్నాయి. క్రెడిట్ కార్డుల్లో రూపే కార్డులు కూడా వస్తున్నాయి. వీటితో దేశంతో పాటు మరికొన్ని దేశాల్లో ఏ మూలకు వెళ్లినా వినియోగించుకోవచ్చు. 5 రూపాయల చాక్లెట్ నుంచి బ్యాంకు నిర్ధారించిన మేరకు డబ్బులను యూపీఐ ద్వారా ట్రాన్స్ ఫర్ చేయవచ్చు. క్రెడిట్ కార్డు వాడకంలో తప్పనిసరి అవగాహన ఉండాలి లేదంటే అప్పుల ఊబిలో కూరుకుపోయే ప్రమాదం ఉంది. చాలా మంది క్రెడిట్ కార్డు బిల్లును గడువులోగా చెల్లించరు. అలా చేస్తే భారీగా పెనాల్టీ పడుతుంది. బాకీ ఉన్న బిల్లును చెల్లించకుంటే ఏమతుంది? అలాంటి సమయంలో ఏం చేయాలో ఇక్కడ తెలుసుకుందాం. మీ బకాయి మొత్తాన్ని ఒకే సారి చెల్లించని పరిస్థితిలో మీరు ఉంటే ఈఎంఐ రూపంలో చెల్లించుకోవచ్చు. దీని వల్ల ఆర్థికంగా కొంత వెసులుబాటు కలుగుతుంది. లేదంటే ఆ బకాయిని మరో కార్డుకు బదిలీ చేసుకొని పర్సనల్ లోన్ గా కూడా చెల్లించే వెసులుబాటు ఉంటుంది.

# కొత్త కార్లను విడుదల చేసిన మారుతి..




ఆటోమొబైల్ రంగంలో మారుతి సుజుకీ సంచలనాలను సృష్టిస్తుంది. వినియో గదారులను ఆకర్షించడానికి కొత్త కొత్త కార్లను అందుబాటులోకి తీసుకొస్తేంది. ఉన్న కార్లపై డిస్కౌంట్లు ప్రకటిస్తూ అలరిస్తోంది. తాజాగా మూడు కార్లను డ్రీమ్ సిరీస్ లో భాగంగా ప్రత్యేక ఎడిషన్లు రిలీజ్ చేసింది. మిగతా కార్ల కంటే డ్రీమ్ సిరీస్ లో ఉండే కార్లు బెస్ట్ సెక్యూరిటీని ఇస్తాయి. అధునాతన ఫీచర్లతో అలరిస్తాయి. ఇదిలా ఉండగా ఈ మూడు కార్లు ఒకే ధరలో ఉండడం విశేషం. అయితే ఇవి తక్కువ సంఖ్యలోనే విక్రయించబడుతాయి. తాజాగా రిలీజ్ అయిన ఈ మూడు కార్ల వివరాలు..మారుతి నుంచి రిలీజ్ అయినా ఆల్టో కె 10 ఇప్పటికే హ్యాచ్ బ్యాక్ వేరింట్ లో బెస్ట్ కారుగా నిలిచింది. ఇప్పుడు దీనిని డ్రీమ్ సిరీస్ లో భాగంగా కొత్తగా రిలీజ్ చేశారు. కొత్త కారు ధరను రూ.5.35 లక్షల తో విక్రయించనున్నారు. ఈ కారులో రివర్స్ పార్కింగ్ కెమెరా, సెక్యూరిటీ సిస్టమ్ తో పాటు ఇతర ప్రయోజనాలు ఉన్నాయి. అలాగే యాక్ససరీస్ లపై డిస్కౌంట్లు ఇవ్వనున్నారు. మారుతి కి చెందిన మరో కారు ఎస్ ప్రెస్సో డ్రీమ్ సిరీస్ లో రిలీజ్ అయింది. ా ప్రెస్సో ఎశఱ వేరియంట్ ఆధారంగా రూపొందించిన ఈ కారులో మ్యాట్ బ్లాక్ క్లాడింగ్, సైడ్ లో స్కిడ్ ప్లేట్లు, సిల్వర్ బాడీ సైడ్ మోల్డింగ్ వంటి ఫీచర్లు ఉన్నాయి. ఇందులోనూ రివర్స్ పార్కింగ్ కెమెరా, సెక్యూరిటీ సిస్టమ్ అలరిస్తోంది. వీటితో పాటు ఇంటీరియర్ స్టైలింగ్ కిట్ కూడా ఉన్నాయి. మరో కారు సెలెరియో డ్రీమ్ సిరీస్ తో రిలీజ్ చేశారు. ఇది హ్యాచ్ బ్యాక్ లలో బెస్ట్ కారుగా నిలిచింది. దీనిని ాశఱ వేరియంట్ లో రూపొందించారు. ఈ కారు ఫీచర్ల విషయానికొస్తే రివర్స్ పార్కింగ్ కెమెరా, స్పీకర్లు అలరిస్తాయి. దీనిని రూ.4.99 లక్షల తో విక్రయించనున్నారు. అయితే ఎంట్రీ లెవల్లో కార్ల విక్రయాలను పెంచడానిక్టి మారుతి అదనపు టెక్నికల్ ఫీచర్లను జోడించింది. అలాగే ఆటో గేర్ షిఫ్ట్ కార్ల ధరలను సైతం తగ్గించింది.

# గ్లాండ్ ఫార్మా ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా

శ్రీనివాస్ సాదు ఇంజెక్టబుల్ ఔషధాలు ఉత్పత్తి చేసే సంస్థ గ్లాండ్ ఫార్మా లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా శ్రీనివాస్ సాదు నియమి తులయ్యారు. ఆయన సీఈఓ బాధ్యతలు కూడా నిర్వర్తిస్తారు. 2019 ఏప్రిల్ 25 నుంచి గ్లాండ్ ఫార్మా ఎండీ, సీఈఓగా శ్రీనివాస్ వ్యవహరిస్తున్నారు. ఔషధ రంగంలో ఆయనకు దాదాపు రెండు దశాబ్దాల అనుభవం ఉంది. గ్లాండ్ ఫార్మా ప్రధానంగా కాంట్రాక్టు ఉత్పత్తి కార్యకలాపాల్లో నిమగ్నమై ఉంది. అమెరికాతో పాటు ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాల్లోని వినియోగదార్లకు ఈ సంస్థ జనరిక్ ఇంజెక్టబుల్ ఔషధాలు, ఇతర మందులు సరఫరా చేస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థంలో కీలక రేట్ల కోతలు ఉండొచ్చని బ్యాంకర్లు, ఆర్థికవేత్తలు అంచనా వేస్తున్నారు. వర్షపాతం సాధారణ కంటే మెరుగ్గా ఉంటుందన్న అంచనాలతో, పంటల దిగుబడి బాగుంటుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది. అందువల్లే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యోల్బణ అంచనాలను 4.5 శాతానికి ఆర్‌బీఐ పరిమితం చేసింది. ఈ ఏడాది అక్టోబరు నుంచి ద్రవ్యోల్బణం తగ్గుముఖం పడుతుందన్న అంచనాల మధ్య, ఆ నెల నుంచి 2025 మార్చిలోగా కీలక రేట్లలో రెండు సార్లు కోత ఉండొచ్చని క్రిసిల్ ముఖ్య ఆర్థికవేత్త పేర్కొన్నారు. డిసెంబరు కల్లా ఆర్‌బీఐ విధానంలో మార్పు రావొచ్చని ఆర్‌బీఎల్ బ్యాంక్ ఆర్థికవేత్త అచలా జెత్మలానీ అంచనా వేస్తున్నారు. అక్టోబరులో



రేట్ల కోత ఉండొచ్చని బ్యాంక్ ఆఫ్ బరోడా ముఖ్య ఆర్థికవేత్త మదన్ సబ్నవీజ్ పేర్కొన్నారు. స్థిరాస్తుల ధరలు బాగా పెరిగిన నేపథ్యంలో, వడ్డీరేట్లు తగ్గితే కనుక వినియోగదార్ల కొనుగోలు శక్తి పెరుగుతుందని, అప్పుడు స్థిరాస్తి రంగానికి బాగుంటుందని ప్రోప్‌ఈక్విటీ ఎండీ సమీర్ జాసుజా పేర్కొన్నారు.

# శాఖహారం 9 శాతం ప్రియం



శాకహారం భోజనం మరింత ఖరీదు అయ్యింది. ఉల్లి, టమోటా, బంగాళ దుంపల రేట్లు పెరిగిపోవడం వల్ల గడిచిన ఏప్రిల్‌లో శాఖహార భోజనం ప్లేట్ 'వెజ్ థాలీ' వ్యయం 9 శాతం పెరిగిందని క్రిసిల్ ఎంఅండ్ఎ రీసెర్చ్ వెల్లడించింది. మరోవైపు చికెన్ రేట్లు తగ్గడం వల్ల మాంసహార ప్లేట్ ధర దిగివచ్చిందని పేర్కొంది. గతేడాది మేలో మాంసహార థాలీ ధర రూ.59.9గా ఉండగా.. గడిచిన నెలలో రూ.55.9కి తగ్గింది. బ్రాయిలర్ చికెన్ ధరలు 16 శాతం క్షీణించడంతో నాన్ వెజ్ థాలీ ధర తగ్గినట్లు నివేదిక తెలిపింది. క్రిసిల్ రిపోర్ట్ ప్రకారం.. రోటీ, కూరగాయలు, అన్నం, పప్పు, పెరుగు, సలాడ్‌లతో కూడిన వెజ్ థాలీ ధర మే నెలలో నెలలో రూ.27.80కి పెరిగింది. గతేడాది ఇదే నెలలో పెరిగిన రూ.25.5తో పోలిస్తే ఎక్కువ. గడిచిన మే నెలలో టమాటా ధరలు 39 శాతం, బంగాళదుంపలు 41 శాతం, ఉల్లి ధరలు 43 శాతం పెరగడమే వెజ్‌థాలీ ధర పెరుగుదలకు కారణం. బియ్యం, పప్పుల ధరలు కూడా వరుసగా 13 శాతం, 21 శాతం చొప్పున ఎగిశాయి. జీలకర్ర, మిర్చి, కూరగాయల నూనె ధరలు వరుసగా 37 శాతం, 25 శాతం, 8 శాతం తగ్గడం కొంత ఉపశమనం కలిగిందని నివేదిక పేర్కొంది.

## జెఇఇ అడ్వాన్స్‌డ్ ఫలితాలు..

# వేద్ లహోటికి ప్రథమ స్థానం

మన దేశంలో ప్రతిష్టాత్మక ఐఐటిల్లో బిటెక్ సీట్ల భర్తీకి నిర్వహించిన జెఇఇ అడ్వాన్స్‌డ్ 2024 ఫలితా ల్లో విడుదలయ్యాయి. ఈ ఏడాది ఐఐటీ ఢిల్లీ జోన్‌కు చెందిన వేద్ లహోటి 360 మార్కులకు 355 మార్కులు సాధించి జాతీయస్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించారు. ఐఐటి బాంబే జోన్‌కు చెందిన ద్విజ ధర్మేష్‌కుమార్ పటేల్ 332 మార్కులతో అమ్మాయిల విభాగంలో మొదటి స్థానంలో నిలిచారు. జెఇఇ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో తెలుగు విద్యార్థు లు మరోసారి సత్తా చాటారు. టాప్ టెన్ ర్యాంకర్లలో ముగ్గురు తెలుగు విద్యార్థులు ఉన్నారు.

ఐఐటి మద్రాస్ జోన్‌కు చెందిన బోగలపల్లి సందేశ్ 360 మార్కులకు 338 సాధించి జాతీయ స్థాయిలో మూడో ర్యాం కు సాధించగా, పుట్టి కుశల్‌కుమార్ 334 మార్కులతో ఐదో ర్యాంకు, అల్లడబోయిన ఎస్ఎస్‌డిబి సిద్విక్ సుహాస్ 329 మార్కుల తో 10వ ర్యాంకు సాధించారు. గత నెల 26న రెండు సెషన్లల్లో నిర్వహించిన ఈ పరీక్షకు 1,80,200 మంది హాజరయ్యారు. అందులో 48,248 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. వారిలో 7,964 మంది అమ్మాయిలున్నారు. ఐఐటి మద్రాస్ జోన్ నుంచే

అత్యధికంగా 10,255 మంది ఉత్తీర్ణులయ్యారు. ఆ తర్వాత స్థానాల్లో ఢిల్లీ, బాంబే,రూర్కే, కాన్పూర్, గువహటి జోన్లు ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల నుంచి దాదాపు 40 వేల మంది రాయగా, ఈ పరీక్షలో తెలుగు విద్యార్థులు మరోసారి ప్రభంజనం సృష్టించారు. ఇప్పటికే ప్రాథమిక కీ విడుదల కాగా, ఆదివారం ఉదయం తుది కీ ని విడుదల చేసి, ఆ తర్వాత ఫలితాలను ప్రకటించారు. ఈ ఏడాది జెఇఇ అడ్వాన్స్‌డ్ పరీక్షకు ఐఐటీ మద్రాస్ నిర్వహించింది. ఫలితాల కోసం https://jeeadv.ac.in వెబ్‌సైట్‌ను చూడవచ్చు. జెఇఇ అడ్వాన్స్‌డ్ పరీక్షలో ఉ



త్తీర్ణులైన వారు ఐఐటీల్లో బి.టెక్ సీట్లకు పోటీ పడేందుకు అవకాశం ఉంటుంది.

మొదటి 10 ర్యాంక్లు సాధించిన టాపర్లు వీళ్లే..

1. వేద్ లహోటి
2. ఆదిత్య
3. భోగలపల్లి సందేష్
4. రిథమ్ కేడియా
5. పుట్టి కుశల్ కుమార్
6. రాజ్‌దీప్ మిశ్రా
7. ద్విజ ధర్మేష్‌కుమార్ పటేల్
8. కోడూరు తేజేశ్వర్
9. దుర్విన్ హేమంత్ దోషి
10. అల్లడబోయిన ఎస్ఎస్‌డిబి సిద్విక్ సుహాస్


# తలసాని శ్రీనివాస్ యాదవ్ ఇంట్లో విషాదం



హైదరాబాద్: మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఇంట్లో విషాదం నెలకొంది. ఆయన సోదరుడు తలసాని శంకర్ యాదవ్ సోమవారం తెల్లవారుజామున కున్నుమూశారు. కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న శంకర్ యాదవ్ సికింద్రాబాద్ లోని యశోద హాస్పిటల్ లో చికిత్స తీసుకుంటూ తుదిశ్వాస విడిచారు. దీంతో ఆయన మృతికి పలువురు బీఆర్ఎస్ నాయకులు సంతాపం తెలిపారు. కాగా, శంకర్ యాదవ్ మోండా మార్కెట్ వ్యాపారుల సంఘం అధ్యక్షుడు ఉన్నారు. గతంలో పలు మార్కెట్లకు కూడా ఆయన అధ్యక్షుడిగా పని చేశారు.

# మోడీకి పాక్ ప్రధాని అభినందనలు


వరుసగా మూడవ సారి ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేసిన నరేంద్ర మోడీకి పాకిస్తాన్ ప్రధాని షెహ్‌బాజ్ షరీఫ్ సోమవారం అభినందనలు తెలియజేశారు. 'భారత ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేసినందుకు నరేంద్ర మోడీకి అభినందనలు' అని షరీఫ్ 'ఎక్స్' పోస్ట్‌లో తెలిపారు. పాకిస్తాన్ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి ముంతాజ్ జహ్రా బలోచ్ శనివారం అనిశ్చిత ప్రకటన నేపథ్యంలో ఈ అభినందన సందేశం వచ్చింది. ప్రధాని మోడీని అభినందిస్తున్నారా అన్న ప్రశ్నకు బలోచ్ 'వారి ఎన్నికల ప్రక్రియపై ఎటువంటి వ్యాఖ్యలూ చేయడం లేదు' అని సమాధానం ఇచ్చారు. కొత్త భారత ప్రభుత్వం అధికారికంగా ప్రమాణ



స్వీకారం చేయనందున అభినందన సందేశాలపై చర్చించడం 'తొందరపాటు' అవుతుందని ఆమె అన్నారు. 'భారత్‌తో సహా తన పొరుగు దేశాలతో సహకార సంబంధాలను పాకిస్తాన్ ఎల్లప్పుడూ వాంఛిస్తుంటుంది.జమ్మూ కాశ్మీర్ ప్రధాన వివాదంతో సహా అన్ని పెండింగ్ సమస్యల పరిష్కారానికి నిర్మాణాత్మక చర్చలను మేము సూచిస్తూనే ఉన్నాం' అని బలోచ్ తెలిపారు. పాకిస్తాన్‌తో సుహృద్భావపూర్వక సంబంధాలను తాము కోరుకుంటున్నామని భారత్ స్పష్టం చేస్తున్నది. అటువంటి చర్చల కోసం పాకిస్తాన్ ముందుగా ఉగ్రవాద, విరోధ రహిత వాతావరణాన్ని సృష్టించాలని కూడా భారత్ స్పష్టం చేసింది.

# మంత్రులకు శాఖల కేటాయింపు పూర్తి..

# లోక్‌సభ స్పీకర్ పదవి ఎవరికో..!



న్యూఢిల్లీ: కేంద్రంలో నరేంద్రమోదీ కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. ప్రధాని మోదీ సహా మంత్రుల ప్రమాణస్వీకారం పూర్తయ్యింది. సోమవారం సాయంత్రం జరిగిన క్యాబినెట్ భేటీలో మంత్రులకు శాఖల కేటాయింపు కూడా అయిపోయింది. ఇక మిగిలింది స్పీకర్ ఎంపికనే. గత రెండు పర్యాయాలు బీజేపీకి పూర్తి మెజారిటీ రావడంతో ఆ పార్టీకి చెందిన ఎంపీలే స్పీకర్ పదవులు చేపట్టారు. ఈసారి బీజేపీకి సొంత మెజారిటీ రాకపోవడంతో.. స్పీకర్ పదవి బీజేపీ ఎంపీనే వరిస్తుందా..? లేదంటే మిత్రపక్ష పార్టీలకు దక్కుతుందా..? అనే విషయం చర్చనీయాంశంగా మారింది. చట్టాలను రూపొందించే పార్లమెంట్ ఉభయసభల్లో లోక్‌సభది కీలకపాత్ర. లోక్‌సభను నడపడం స్పీకర్ విధి. అధికార, విపక్ష సభ్యులతో కూడిన ఈ సభను సజావుగా నడపటం అంత సులువేం కాదు. ఈ పోస్టులో ఉన్నవారు రాజ్యాంగబద్ధంగా వ్యవహరించాల్సి ఉంటుంది. అవిశ్వాస తీర్మానం, పార్టీ ఫిరాయింపులు, కీలక బిల్లులు గట్టెక్కడం లాంటి విషయాల్లో స్పీకర్‌ది కీలకపాత్ర. అందుకే ఇప్పుడు అందరిదృష్టి స్పీకర్ పదవి ఎవరికి దక్కుతుందనే దానిపైనే ఉంది. మోదీ నూతన ప్రభుత్వ ఏర్పాటులో టీడీపీ, జేడీయూ కీలకంగా మారాయి. ఈ క్రమంలో ఆ రెండు పార్టీలు స్పీకర్ పదవి తమకే కావాలని కోరుతున్నట్లు వార్తలు వచ్చాయి. అయితే కేంద్ర మంత్రివర్గంలో హోం, రక్షణ, ఆర్థికశాఖలతోపాటు స్పీకర్ పదవిని తమవద్దే అట్టిపెట్టుకోవాలని బీజేపీ భావిస్తున్నట్లు తెలిసింది. కాబట్టి ఇతర పార్టీలకు స్పీకర్ పదవి దక్కకపోవచ్చనే టాక్ వినిపిస్తోంది. బీజేపీనే స్పీకర్ పదవి చేపడితే రాజస్థాన్ నుంచి లోక్‌సభకు ఎన్నికైన ఓం బిర్లాకే మరోసారి అవకాశం దక్కే ఛాన్స్ ఉంది. అయితే మరోవైపు ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్షురాలు పురంధేశ్వరి పేరు కూడా ప్రచారంలో ఉంది. అలాగని వీరిద్దరిలో ఎవరో ఒకరిని స్పీకర్ పదవి వరిస్తుందని కూడా కచ్చితంగా చెప్పలేం. వీరిద్దరూ కాకుండా అనూహ్యంగా వేరెవరి పేరైనా తెరపైకి వచ్చినా పెద్దగా ఆశ్చర్యపోనక్కర్లేదు. జూన్ 18న లోక్‌సభ తొలి సమావేశాలు ప్రారంభమవుతాయని తెలుస్తోంది. అదేగనుక జరిగితే జూన్ 20 కల్లా స్పీకర్ పోస్టుపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

## కిషన్ రెడ్డికి గనులు..

# రామ్మోహనుడికి విమానయానం..!

ప్రధానమంత్రి నరేంద్రమోదీ సారధ్యంలో ఎన్డీఏ ప్రభుత్వం ముచ్చటగా మూడోసారి కొలువు దీరింది. 71 మంది మంత్రులతో ఆదివారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రమాణం చేయించారు. సోమవారం జరిగిన క్యాబినెట్ సమావేశంలో ప్రధాని మోదీ.. మంత్రులకు శాఖలు కేటాయించారు. తెలంగాణలోని సికింద్రాబాద్ లోక్ సభా స్థానం నుంచి రెండోసారి గెలుపొందిన బీజేపీ నేత జీ కిషన్ రెడ్డికి బొగ్గు, గనుల శాఖ లభించింది. కరీంనగర్ నుంచీ రెండోసారి ఎన్నికైన బండి సంజయ్ కుమార్‌ను ప్రధాని మోదీ హోంశాఖ సహాయ మంత్రిగా నియమించారు. టీడీపీ నుంచి క్యాబినెట్ లోకి తీసుకున్న కింజారపు రామ్మోహన్ నాయుడుకు పౌర విమానయాన శాఖ, గుంటూరు ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్‌కు గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖల సహాయ మంత్రి, నర్సాపురం ఎంపీ భూపతి రాజు శ్రీనివాస వర్మకు భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ సహాయ మంత్రి పదవులు లభించాయి.





**కిషన్ రెడ్డికి బొగ్గు, గనులశాఖ**

సికింద్రాబాద్ ఎంపీ జీ కిషన్ రెడ్డికి బొగ్గు, గనులశాఖలను ప్రధాని మోదీ కేటాయించారు. ఇంతకుముందు పర్యాటక శాఖ మంత్రిగా పని చేశారు. దేశంలోని థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ తయారీకి అవసరమైన బొగ్గు సరఫరా చేయడం కిషన్ రెడ్డికి అతిపెద్ద సవాల్ కానున్నది. కోల్ గ్యాసిఫికేషన్, కోల్ బెడ్ మిథేన్ తయారీలో ప్రైవేట్ రంగ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. దేశంలో విద్యుత్ ఉత్పత్తిలో బొగ్గు కీలక పాత్ర పోషిస్తుందని జీ కిషన్ రెడ్డి సోమవారం ఢిల్లీలో మీడియాతో చెప్పారు. తనపై ప్రధాని మోదీ పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని చెప్పారు.

2019 ఎన్నికల్లో తొలిసారి సికింద్రాబాద్ లోక్ సభా స్థానం నుంచి గెలుపొందిన కిషన్ రెడ్డి, తాజా సార్వత్రిక ఎన్నికల్లోనూ సమీప కాంగ్రెస్ ప్రత్యర్థి దానం నాగేందర్‌పై 49 వేల పై చిలుకు ఓట్ల తేడాతో విజయం సాధించారు. తెలంగాణలోని రంగారెడ్డి జిల్లాలో మధ్యతరగతి రైతు కుటుంబంలో జన్మించిన కిషన్ రెడ్డి 1977 నుంచి సాధారణ కార్యకర్తగా బీజేపీలో రాజకీయాల్లోకి ప్రవేశించారు. బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు, బీజేవైఎం జాతీయ అధ్యక్షుడిగానూ పని చేశారు. గత ప్రభుత్వంలో హోం, పర్యాటకం, సాంస్కృతికం, ఈశాన్య ప్రాంత అభివృద్ధి శాఖలను నిర్వహించారు. సికింద్రాబాద్ లోక్ సభా స్థానానికి ఎన్నికవ్వక ముందు 2004 నుంచి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీకి రెండుసార్లు, తెలంగాణ అసెంబ్లీకి ఒకసారి ఎన్నికయ్యారు.

**రామ్మోహన్‌కు విమాన యానం**

పార్లమెంటుకు మూడుసార్లు ఎన్నికైన శ్రీకాకుళం ఎంపీ కింజారపు రామ్మోహన్ నాయుడుకు తొలిసారే కేంద్ర పౌర విమానయాన శాఖ అప్పగించారు. గత ప్రభుత్వంలో విమానయానశాఖ నిర్వహించిన జ్యోతిరాదిత్య సింధియాకు టెలీ కమ్యూనికేషన్ల శాఖ కేటాయించారు. కింజారపు రామ్మోహన్ నాయుడు.. ఏపీలో అధికారంలోకి వచ్చిన టీడీపీ నేత. 2024లో కేంద్రంలో బీజేపీ తిరిగి అధికారంలోకి రావడంలో బీజేపీ కీలక పాత్ర పోషించింది. శ్రీకాకుళం నుంచి మూడోసారి లోక్ సభకు ఎన్నికైన రామ్మోహన్ నాయుడు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా కూడా ఉన్నారు. ఆయన తండ్రి ఎర్రన్నాయుడు తొలుత టెక్కలి నుంచి శాసనసభకు ఎన్నికవ్వగా, తదుపరి 1996 నుంచి 2004 మధ్య నాలుగు సార్లు శ్రీకాకుళం ఎంపీగా గెలిచారు. కేంద్రంలో యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వ హయాంలో ఎర్రన్నాయుడు గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రిగా పని చేశారు.

**బండికి హోంశాఖ సహాయ మంత్రి**

కరీంనగర్ నుంచి రెండోసారి పార్లమెంటుకు ఎన్నికైన బండి సంజయ్ కుమార్‌ను ప్రధాని నరేంద్రమోదీ హోంశాఖ సహాయ మంత్రిగా నియమించారు. చిన్నప్పటి నుంచి ఆరెస్సెస్ కార్యకర్తగా పని చేస్తూ వచ్చిన బండి సంజయ్.. రెండు సార్లు కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్ గా గెలిచారు. 2014 , 2018, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలైనా 2019, 2024 లోక్ సభ ఎన్నికల్లో విజయం సాధించారు. అంతకుముందు 1994, 1999ల్లో కరీంనగర్ అర్బన్ సహకార బ్యాంకు డైరెక్టర్ గానూ గెలుపొందారు.


**పెమ్మసానికి గ్రామీణాభివృద్ధి.. కమ్యూనికేషన్లు..**

గుంటూరు నుంచి తొలిసారి ఎంపీగా ఎన్నికైన టీడీపీ నేత పెమ్మసాని చంద్రశేఖర్ ను ప్రధాని నరేంద్ర మోదీ గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖల సహాయ మంత్రిగా నియమించారు. పెమ్మసాని చంద్రశేఖర్ వృత్తిరీత్యా వైద్యులు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎంసెట్ లో 27వ ర్యాంకుతో ఉస్మానియా మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ విద్యనభ్యసించిన పెమ్మసాని.. పీజీ కోసం అమెరికాకు వెళ్లారు. గుంటూరు జిల్లా నుంచి సాధారణ వైద్యుడిగా వెళ్లిన పెమ్మసాని.. అమెరికాలో అనతి కాలంలోనే అంతర్జాతీయ గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయన తండ్రి పెమ్మసాని సాంబశివరావు టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీలోనే కొనసాగారు.

**భూపతిరాజుకు భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖలు**

నర్సాపురం నుంచి తొలిసారి పార్లమెంట్ కు ఎన్నికైన భూపతి రాజు శ్రీనివాస వర్మను ప్రధాని నరేంద్రమోదీ భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖల సహాయ మంత్రిగా నియమించారు. విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లో పని చేసిన శ్రీనివాస వర్మ.. విశాఖలోని ఆంధ్రా విశ్వవిద్యాలయంలో ఎంఏ చేశారు. 2014లో తొలిసారి భీమవరం మున్సిపాలిటీ కార్పొరేటర్ గా ఎన్నికయ్యారు. 2024 ఎన్నికల్లో టీడీపీ–జనసేన మద్దతుతో నర్సాపురం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు.

# మోదీ మూడో ప్రభుత్వంలో.. ఏడుగురు మహిళా మంత్రులు



న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో ఆదివారం ఏర్పడిన మూడో ప్రభుత్వంలో 72 మంది కేంద్ర మంత్రులున్నారు. వీరిలో ఏడుగురు మహిళలు. గతంలో ఆర్థిక, రక్షణ మంత్రిత్వ శాఖలు నిర్వహించిన రాజ్యసభ సభ్యురాలైన నిర్మలా సీతారామన్‌తోపాటు జార?ండ్‌లోని కోడెర్మా ఎంపీగా రెండుసార్లు గెలిచిన అన్నపూర్ణా దేవి కేబినెట్ మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. గత ప్రభుత్వంలో అన్నపూర్ణా దేవి విద్యాశాఖ సహాయ మంత్రిగా ఉన్నారు. కాగా, ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ మిత్రపక్షమైన అప్నా దళ్ (సోనేలాల్) అధినేత్రి అనుప్రియా పటేల్ కేంద్ర సహాయ మంత్రిగా ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. మోదీ తొలి ప్రభుత్వంలో ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రిగా ఆమె పనిచేశారు. మోదీ రెండో ప్రభుత్వంలో వాణిజ్యం, పరిశ్రమల శాఖ సహాయ మంత్రిగా ఉన్నారు. ఈ లోక్‌సభ ఎన్నికల్లో ఆమె పార్టీ గెలిచిన ఎంపీ స్థానాల సంఖ్య రెండు నుంచి ఒకటికి పడిపోయింది. మరోవైపు 30 ఏళ్ల రక్షా ఖడ్సే మరో కేంద్ర సహాయ మంత్రిగా ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. మహారాష్ట్రకు చెందిన రాజకీయ నేత ఏక్‌నాథ్ ఖడ్సే కోడలైన ఆమె రేవర్ నుంచి మూడుసార్లు ఎంపీగా గెలిచారు. గతంలో సర్పంచ్‌గా, జిల్లా పరిషత్ సభ్యురాలిగా ఆమె పనిచేశారు. కర్ణాటక నుంచి రెండుసార్లు బీజేపీ ఎంపీగా గెలిచిన శోభా కరంద్లాజే కూడా కేంద్ర సహాయ మంత్రిగా ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. గత ప్రభుత్వంలో కూడా ఫుడ్ ప్రాసెసింగ్, పరిశ్రమలు, వ్యవసాయం, రైతుల సంక్షేమ శాఖల సహాయ మంత్రిగా ఆమె ఉన్నారు. కాగా, మధ్యప్రదేశ్‌లోని ధార్ ఎంపీ స్థానం నుంచి రెండుసార్లు ఎంపీగా గెలిచిన సావిత్రి ఠాకూర్ ఆదివారం కేంద్ర సహాయ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. మోదీ మూడో ప్రభుత్వంలో తొలిసారి మంత్రి పదవిని ఆమె చేపట్టారు. మధ్యప్రదేశ్‌లోని భావ్‌నగర్ ఎంపీగా గెలిచిన 57 ఏళ్ల నిముబెన్ భంబనియా కూడా తొలిసారి కేంద్ర సహాయ మంత్రిగా ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. మాజీ ఉపాధ్యాయురాలైన ఆమె గతంలో భావ్‌నగర్ మేయర్‌తోపాటు స్థానిక బీజేపీలో పలు పదవులు చేపట్టారు. మరోవైపు మోదీ మూడో ప్రభుత్వంలో కేంద్ర మంత్రులుగా ఏడుగురు మహిళలు ఉండగా, గత ప్రభుత్వంలో పది మంది మహిళా మంత్రులు ఉన్నారు. ఈ ఏడాది లోక్‌సభ ఎన్నికల్లో మొత్తం 74 మంది మహిళలు ఎంపీలుగా గెలిచారు. అయితే 2019లో ఎన్నికైన 78 మందితో పోలిస్తే ఈసారి మహిళా ఎంపీల సంఖ్య స్వల్పంగా తగ్గింది.

# మోదీ సర్కారులో అత్యంత సంపన్న మంత్రి ఎవరో తెలుసా?

న్యూఢిల్లీ: ప్రధాని మోదీ నేతృత్వంలో కొత్త క్యాబినెట్ మంత్రులు ఆదివారం ప్రమాణ స్వీకారం చేసిన విషయం తెలిసిందే. అయితే ఆ మంత్రుల్లో తెలుగుదేశం పార్టీ ఎంపీ డాక్టర్ చంద్ర శేఖర్ పెమ్మసాని. అత్యంత సంపన్న మంత్రిగా నిలిచారు. చంద్రశేఖర్ పెమ్మసాని తన ఆస్తులను రూ.5705 కోట్లుగా చూపించారు. 18వ లోక్‌సభ మంత్రి మండలిలో ఆయనే సంపన్న మంత్రిగా ఉన్నారు. కేంద్ర సహాయ మంత్రిగా ఆయన ప్రమాణ స్వీకారంచేశారు. లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసిన అత్యంత సంపన్న ఎంపీ అభ్యర్థిగా కూడా ఆయనే నిలిచారు. కేంద్ర క్యాబినెట్ ర్యాంక్ మంత్రుల్లో మాత్రం.. జ్యోతిరాధిత్య సింధియా రూ.484 కోట్లతో అత్యంత సంపన్న మంత్రిగా నిలిచారు. లోక్‌సభకు ఎన్నికైన వారిలో.. సింధియా రిచ్చెస్ట్ ఎంపీల్లో ఆరవ స్థానంలో ఉన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో గెలిచిన టాప్ 10 రిచ్చెస్ట్ ఎంపీల్లో .. పెమ్మసాని, సింధియా మాత్రమే మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు.

Printed, Published and owned by **VISHWANATH V**, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301.
and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : **VISHWANATH V**, **RNI Regd. No. TELTEL/2023/86207**, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com